

మొవ్వ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ

● కిటకిట..!



పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

- పోటెత్తిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- నేటి నుంచి భూముల ధరలు పెరగడం వల్లే..
- శుక్రవారం భారీగా జరిగిన లావాదేవీలు
- పటమట, గుణదల, గాంధీనగర్ కార్యాలయాల్లో రద్దీ
- ఒక్కసారిగా ఒత్తిడిపడి స్తంభించిన సర్వర్
- కార్యాలయాల్లోనే పడిగాపులు పడిన సందర్శకులు
- రాత్రి 9.30 గంటల వరకు రిజిస్ట్రేషన్లు
- అర్ధరాత్రి వరకు పనిచేసిన అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రిజిస్ట్రేషన్ల కోసం వచ్చినవారితో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శుక్రవారం కిటకిటలాడాయి. భూముల ధరల పెంపుదల శనివారం నుంచి అమల్లోకి రానుండటంతో శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భారీగా లావాదేవీలు జరిగాయి. విజయవాడ నగరంలోని పటమట, గాంధీనగర్, గుణదల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాల్లోని ఇబ్రహీంపట్నం, నున్న, గన్నవరం, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కళకళలాడాయి. శనివారం నుంచి భూముల ధరలు పెంచాల్సి ఉండటంతో ఓవక్క సాంకేతిక సిబ్బంది కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోకి భూముల ధరలను అప్‌లోడ్ చేస్తుండటం.. మరోవైపు రిజిస్ట్రేషన్లు కూడా ఎక్కువ మిగతా 6లో..

● శ్రీకారం



గుణదల లూర్దుమాత మహోత్సవాల నవదిన ప్రార్థనలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుణ్యక్షేత్రం ప్రధాన చర్చి వద్ద మరియమాత పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయి. 8లో

దారుణాలు

జిల్లాలో పెచ్చుమీరుతున్న రికవరీ ఏజెంట్ల వేధింపులు

ఒక్క వాయిదా చెల్లించకపోయినా వీరంగాలు

● రావి సత్తిబాబు (30) ఆటోడ్రైవర్. గుడివాడ రూరల్ మండలం మోటూరు నివాసి. విస్తార్ ప్రైవేట్ బ్యాంక్ నుంచి రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాడు. జనవరి నెల వాయిదా ఐదో తేదీన చెల్లించాలి. భార్య అనారోగ్యానికి గురికావడంతో వాయిదా చెల్లించలేకపోయాడు. ఇదే విషయాన్ని సత్తిబాబు రికవరీ ఏజెంట్లకు చెప్పాడు. అయినా వారు వినలేదు. డబ్బు చెల్లించాలని పదేపదే ఫోన్లు చేశారు. ఈనెల 28వ తేదీన గుడివాడలోని ఆటోస్టాండ్‌కు వెళ్లి గొడవపడ్డారు. అక్కడితో ఆగకుండా ఇంటికి వెళ్లి రచ్చ చేశారు. నెల వాయిదా చెల్లింపు ఆలస్యమైనందుకు ఏకంగా జప్తు నోటీసును అంటించారు. దీనికి మనస్తాపం చెందిన సత్తిబాబు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టి ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు.

● హరిత వర్షిణి ఈఏపీసెట్‌లో ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి ప్రభాకర్ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రూ.3.50 లక్షల అప్పు తీసుకుని సకాలంలో చెల్లించలేకపోయారు. రికవరీ ఏజెంట్లు ఇంటికి వెళ్లి ఇష్టానుసారంగా మాట్లాడారు. అమర్యాదగా మాట్లాడారు. చివరికి ఆ అమ్మాయిపై నోరుజారారు. ఈ మాటలకు మనస్తాపం చెందిన హరిత వర్షిణి ఆత్మహత్య చేసుకుంది. నంది గామ రైతుపేటలో గడిచిన ఏడాది జరిగిన ఘటన ఇది.

..ఈ రెండు ఘటనలు రికవరీ ఏజెంట్లు చేస్తున్న దారుణాలకు ప్రత్యక్ష ఉదాహరణలు. వాయిదా చెల్లించడం కాస్త ఆలస్యమైతే చాలు.. చిన్నా పెద్దా, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా నానా బీభత్సం సృష్టిస్తున్నారు. క్రెడిట్ కార్డులు, ప్రైవేట్ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న వారు తర్వాతి రోజుల్లో బాధితులుగా మారుతున్నారు. కొందరు ప్రాణాలు తీసుకుంటున్నారు.

- కనీస మర్యాద కూడా లేకుండా దూషణలు
- ఫోన్లలో లేదంటే ఇళ్ల వద్దకొచ్చి దుర్భాషలు
- గుడివాడ ఘటనలో జరిగింది ఇదే..
- ఒక్క వాయిదా చెల్లించనందుకే ఇంటికి నోటీసు
- మనస్తాపం చెందిన ఆటోడ్రైవర్ సత్తిబాబు
- పరువుపోయిందని పోస్ట్‌చేసి ఆత్మహత్య



(ఆంధ్రజ్యోతి-విజయవాడ/గుడివాడ) : ప్రస్తుతం క్రెడిట్ కార్డు ఫ్యాషన్ పెరిగిపోయింది. అవసరం ఉన్నా, లేకపోయినా క్రెడిట్ కార్డులు తీసేసుకుంటున్నారు. కార్డు జేబులోకి రాగానే అవసరాలు పెరుగుతున్నాయి. ఇవే కొందరి జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. అదనపు అర్హతతో వచ్చిన క్రెడిట్ కార్డు ఆర్థిక పరిస్థితిని అగమ్యగోచరంగా మార్చేస్తోంది. వాస్తవానికి అన్ని ప్రభుత్వ ప్రైవేటురంగ బ్యాంకులు సొంతంగా క్రెడిట్ కార్డులను ఇస్తున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సిబిల్ స్కోర్‌ను పరిశీలించి కొన్ని బ్యాంకులు క్రెడిట్ కార్డులను జారీ చేస్తున్నాయి. కొన్ని బ్యాంకులు మాత్రం ఆయా బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లను బట్టి కార్డులు ఇస్తున్నాయి. వీటిని తీసుకున్నప్పుడు కనిపించిన ఆనందం ఆ తర్వాత ఉండట్లేదు. బ్యాంకులు ఇచ్చిన క్రెడిట్ కార్డులపై కొందరు రుణాలు తీసుకుంటే, మరికొంతమంది వాయిదాల పద్ధతిలో వస్తువులు కొంటున్నారు. ఈ వాయిదాలు సక్రమంగా చెల్లించినంత కాలం ఎలాంటి సమస్య రావట్లేదు. ఒక్క వాయిదా పడేసరికి మొత్తం ట్రాక్ మారిపోతోంది. మూడు నెలల వరకు వరుసగా వాయిదాలు చెల్లించకపోతే ఆ ఖాతాను మొండిబకాయిలుగా బ్యాంకులు గుర్తిస్తున్నాయి. ఈ ఖాతాలను ఎన్‌పీఏ జాబితాలోకి చేరుస్తున్నాయి. ఈ బకాయిలు వసూలు చేసే బాధ్యతను బ్యాంకులు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తున్నాయి. ఇందుకు ఏజెన్సీకి కమీషన్లు చెల్లిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు 0.5 శాతం, మరికొన్ని మిగతా 6లో..







మృతుడు సత్తిబాబు (ఫైల్), ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఇంటి తలుపునకు అంటించిన నోటీసు, ఫేస్‌బుక్‌లో సత్తిబాబు పోస్ట్

అల్లరి చేసి.. ఉసురు తీశారు!

- గడువు కోరినా.. ఇంటికి నోటీసులు
- మనస్తాపంతో బలవన్మరణం
- వీధిన పడిన కుటుంబం

6లో

మచిలీపట్నంలోని కర్ణాటక బ్యాంకు



బంగారం.. బండారం..

మచిలీపట్నం బ్యాంకుల్లో వరుసగా బంగారం మాయం

ఇప్పటికే పలు బ్యాంకుల్లో వెలుగుచూసిన ఘటనలు

- తాజాగా కర్ణాటక బ్యాంకులోనూ..
- బంగారం స్థానే రోల్డుగోల్డు నగలు పెట్టి దోపిడీ
- అంతుచిక్కని ప్రశ్నలు ఎన్నో...

మచిలీపట్నం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని కొన్ని బ్యాంకుల్లో బంగారం మాయం అవుతుండటం, ఆ స్థానే రోల్డ్‌గోల్డ్ నగలు పెట్టడం, ఈ వ్యవహారాలన్నీ రూ.కోట్లలో జరుగుతుండటం సంచలనంగా మారింది. ఇప్పటికే పలు బ్యాంకుల్లో రూ.కోట్లలో బంగారు నగలు మాయం కాగా, తాజాగా కర్ణాటక బ్యాంకులో రుణం కోసం తాకట్టు పెట్టిన రూ.కోటి 70 లక్షల విలువైన బంగారు నగలు మారిపోవడం వెనుక అనేక ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

తప్పెవరిది?

ఖాతాదారుడు రుణం కోసం వచ్చినప్పుడు ఆ బంగారం నాణ్యతను అప్రయిజర్ పరిశీలిస్తాడు. ఆయన ధ్రువీకరించాక ఖాతాదారుడికి రుణం ఇస్తారు. అలాంటిది రుణం ఇచ్చిన తరువాత ఆ నగలను అప్రయిజర్ సరిగ్గా విలువ కట్టడం లేదంటూ తప్పించుకుంటున్నారు. చాలా బ్యాంకుల్లో అసిస్టెంట్ మేనేజర్లే ఇలా వ్యవహరిస్తున్నారు. అలాగే, ఏదైనా ఒక లాకర్ తీయాలంటే అకౌంటెంట్, మేనేజర్‌కు తెలియాలి. అలాంటిది మేనేజర్‌కు తెలియకుండా అసిస్టెంట్ మేనేజర్ కోట్లాది రూపాయల నగలను ఎలా మారుస్తున్నారనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. కొందరు అసిస్టెంట్ మేనేజర్లు, అకౌంటెంట్లు చెడువ్యసనాలకు అలవాటు పడి ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అసలు మిగతా 6లో..

కర్ణాటక బ్యాంకులో తవ్వేకొద్దీ నిజాలు

కర్ణాటక బ్యాంకులో రూ.కోటి 60 లక్షల నగలు మాత్రమే అసిస్టెంట్ మేనేజర్ సోమశేఖరరావు దొంగిలించాడని చెబుతున్నారు. అయితే, మరిన్ని చోరీలు వెలుగులోకి వచ్చే అవకాశం కూడా కనిపిస్తోంది. కర్ణాటక బ్యాంకులో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

దేవాంతకుడు

దుర్గగుడిలో దళారీ రూటేవేరు

- కాంటాక్ట్ లిస్టులో లేని సిబ్బంది ఫోన్ నెంబర్లు
- మెదడులో నిక్షిప్తం చేసుకుని ఎప్పటికప్పుడు పేమెంట్లు
- ఫోన్‌పే, గూగుల్ పే చెల్లింపులు మాత్రమే ఫోన్లలో..
- విచారణలో మూడు విభాగాల పేర్లు బహిర్గతం
- 41ఏ నోటీసు ఇచ్చి నిందితుడ్ని వదిలిపెట్టిన పోలీసులు



డిప్యూటీ శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నిత్యం మనతో తిరిగే వ్యక్తిని చాలా సులువుగా గుర్తుపడతాం. కానీ, అతని ఫోన్ నెంబరును మాత్రం ఠక్కున చెప్పలేం. ఫోన్‌లో కాంటాక్ట్ లిస్ట్ చూసి చెప్తాం. అటువంటిది ఓ దళారీ మాత్రం పదుల సంఖ్యలో ఉన్న దుర్గగుడి సిబ్బంది ఫోన్ నెంబర్లను మైండ్‌లో భద్రపరుచుకున్నాడు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగిస్తున్నా.. దాన్ని ఫోన్లు చేయడానికి, గూగుల్, ఫోన్‌పేల్లో డబ్బులు పంపడానికే వినియోగించాడు. దుర్గగుడిలో భక్తుల నుంచి డబ్బు వసూలుచేసి అనధికారికంగా దర్శనాలు చేయిస్తున్న దళారీ 'డిప్యూటీ' శ్రీనివాస్ మేధోశక్తి ఇది. డిప్యూటీ శ్రీనివాస్ కేసు విచారణలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. శ్రీనివాస్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేయగా, విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా చెల్లింపుల్లో మాత్రమే నెంబర్లు కనిపిస్తున్నాయి. కాంటాక్ట్ మిగతా 6లో..

భూమ్‌ధామ్..!

నేటి నుంచి పెరిగిన భూముల ధరలు అమల్లోకి..

విజయవాడలో కనిష్టంగా ధరల పెంపు ● బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో 3 శాతమే..

- మిగిలిన ప్రాంతాల్లో గరిష్టంగా 10 శాతం వరకు..
- బందరు రోడ్డు, ఏలూరు రోడ్లలో ఇక గజం రూ.1.15 లక్షలు
- మచిలీపట్నంలో 10 నుంచి 15 శాతం పెంపు
- రెండు జిల్లాల మున్సిపాలిటీల్లో 10 శాతం
- నాలుగేళ్లుగా పెంపుదల లేని ప్రాంతాల్లో 15 శాతం
- రెండు జిల్లాల గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం ఫిక్స్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పెంచిన భూముల ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా 5 నుంచి 15 శాతం మేర భూముల ధరలను పెంచారు. నాలుగేళ్లుగా ఎలాంటి పెంపుదలకు నోచుకోని ప్రాంతాల్లో గరిష్టంగా 10 శాతం మేర పెంచారు. విజయవాడ నగరంలో చాలా తక్కువగా పెంచారు.

ర్యాపిడ్ గ్రోత్ ఏరియాల్లో 15 శాతం వరకు..

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల పరిధిలోని ర్యాపిడ్ గ్రోత్ ఏరియాల్లో మాత్రం 10 నుంచి 15 శాతం మేర భూముల ధరలు పెంచారు. విజయవాడ నగరం విషయానికొస్తే.. వరద ప్రభావిత ప్రాంతాల్లో భూముల ధరల పెంపు అత్యల్పంగా జరిగింది. బుడమేరు వరద ప్రభావ ప్రాంతాలైన సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక, రాధానగర్, జక్కంపూడి, నందమూరినగర్, వాంబేకాలనీ, రాజరాజేశ్వరిపేట, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, బర్మాకాలనీ, సుందరయ్యనగర్, పటేల్ నగర్, శాంతినగర్, ప్రశాంతినగర్, అంబాపురం, జక్కంపూడి, పి.నైనవరం తదితర ప్రాంతాల్లోని డివిజన్లలో 3 శాతం మించి భూముల ధరలు పెంచలేదు. బందరు రోడ్డు, ఏలూరు రోడ్లలో 5 నుంచి 8 శాతం మేర భూముల ధరలు పెంచారు. దీంతో బందరు రోడ్డులో గజం రూ.1.15 లక్షలు, ఏలూరు రోడ్డులో గజం రూ.1.15 లక్షలైంది. ఈ దఫా మిగతా 6లో..



చిట్టూరి భార్గవ్ (ఫైల్)

చదువు కోసం వెళ్లి దుర్మరణం

- ఐర్లాండ్‌లో రోడ్డు ప్రమాదం
- జగ్గయ్యపేట, గుంటూరు యువకులు మృతి
- చెట్టును ఢీకొన్న కారు.. మరో ఇద్దరికి గాయాలు

8లో

మిద్దెతోట.. ఆరోగ్యానికి కోట

- 70 ఏళ్ల విశ్రాంత ఉపాధ్యాయిని శ్రమకు ప్రతిఫలం
- మచిలీపట్నంలోని గాంధీనగర్‌లో అందాల వనం
- సేంద్రియ ఎరువులతో స్వచ్ఛమైన కూరగాయలు

8లో

కుంభమేళాకు ప్రత్యేక బస్సులు

- 11న తిరుపతి నుంచి, 12న నెల్లూరు నుంచి పర్యాటక బస్సులు
- 5న పీఎన్‌బీఎస్ నుంచి ఆర్టీసీ బస్సు



టీడీపీ కౌన్సిలర్ రాజీనామా



కమిషనర్‌కు రాజీనామా లేఖ అందజేస్తున్న కౌన్సిలర్ సంధ్యారాణి

జగ్గయ్యపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పురపాలకసంఘ 21వ వార్డు టీడీపీ కౌన్సిలర్ గెల్లా సంధ్యారాణి గురువారం రాత్రి తన పదవికి రాజీనామా చేస్తు కమీషనర్ ఎం.రామ్మోహన్‌కు లేఖను అందజేశారు. ఆమె భర్త వైకుంఠేశ్వరరావు 21వ క్లస్టర్ ఇన్‌చార్జ్ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా చేస్తూ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు పత్రాలు అందజేశారు. దీనిని సామాజిక మాధ్యమాల లో పోస్టు చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల పదవులకు న్యాయం చేయలేక పోతున్నందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే తాతయ్య, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావులు సంధ్యారాణి, వైకుంఠేశ్వరరావు దంపతులతో మాట్లాడారు.

శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు పూర్తి చేయండి

» వివిధ శాఖల అధికారులతో ఆర్డీవో సమీక్ష

మోపిదేవి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26, 27 తేదీల్లో మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా పనులను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని మచిలీపట్నం ఆర్డీవో ఎస్.స్వాతి తెలిపారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై శుక్రవారం స్వామివారి మండపంలో ఆయా శాఖల అధికారులతో ఆర్డీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా దేవస్థానం ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు మాట్లాడుతూ, పెదకళ్లేపల్లిలో కృష్ణానది ఉత్తర వాహినియై ప్రవహిస్తుండటంతో మహాశివరాత్రి పర్వదినాన లక్ష మందికిపైగా భక్తులు విచ్చేస్తారని, వారికి ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు.ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.శ్రీవిద్య, ఎంపీడీవో స్వర్ణభారతి, మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

3న కృష్ణా వర్సిటీలో ఫార్మసీ స్పాట్ అడ్మిషన్లు

మచిలీపట్నం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మా స్యూటికల్స్ ఆఫ్ రీసెర్చ్‌లో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ఫిబ్రవరి 3న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్టు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఎల్.సుశీల్ తెలిపారు. 3న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియలో ఈఏపీసీఈటీ పరీక్షకు హాజరుకాని వారు, పరీక్షకు హాజరై అర్హత సాధించని వారికి కూడా అవకాశం కల్పించామన్నారు. రూ.1800 చెల్లించి అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనవచ్చన్నారు. 10వ తరగతి, ఇంటర్, ట్రాన్స్ సర్టిఫికెట్‌లు, కుల ధృవీకరణ పత్రాలు, ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరు కావాలన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో చేరిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదన్నారు. కాగా 3, 5, 9వ సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు వెల్లడించారు. 6006 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2962 మంది ఉత్తీర్ణత సాధించారు. 49.31 శాతం ఉత్తీర్ణత పొందినట్టు పరీక్షల నియంత్రణ అధికారి పీవీ బ్రహ్మచారి తెలిపారు.



కూచిపూడి నాట్య పరీక్షలు ప్రారంభం

కూచిపూడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠంలో ఎంపీఏ నాట్య ప్రాక్టికల్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దరువులు, ఉపకరణాల అంశాలపై పరీక్షలు నిర్వహించగా, 17 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల పరిశీలకునిగా భాగవతుల శ్రీనివాస శర్మ, చీఫ్ సూపరింటెండెంట్‌గా చింతా రవిబాలకృష్ణ వ్యవహరించారు. నట్టువాంగంపై యేలేశ్వరపు శ్రీనివాసులు, గాత్రం వెంకట దుర్గాభవాని, తబలా హరనాథ శాస్త్రిలు సహకరించారు.

బంగారం.. బండారం..

(5వ పేజీ తరువాయి)

బంగారాన్ని మాయం చేసి వేరొక చోట కుదవపెట్టడం కానీ, అమ్మడం కానీ చేస్తున్నారని తెలుస్తోంది.

చర్యలేవీ..?

ఇప్పటికే మచిలీపట్నంలోని చాలా బ్యాంకుల్లో రూ.కోట్లలో నగలను మాయం చేశారు. నగలను కాజేసి పరారైన వారిపై కేసులు పెట్టినా పూర్తిస్థాయిలో రికవరీ జరగలేదు. దీంతో ఎన్నిసార్లు దొంగతనాలు చేసినా ఎవరేమి చేస్తారులే.. అనుకుంటూ కొందరు ఇలా దోపిడీకి పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు కేవలం సస్పెండ్ చేసి వదిలేస్తున్నారు. కర్ణాటక బ్యాంకు వ్యవహారాన్ని పరిశీలిస్తే.. ఆడిట్ సమయంలో దొంగతనం బయటపడింది. ఇలా పలు బ్యాంకుల్లో ఆడిట్ సమయంలో దొంగతనాలువెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఓ బ్యాంకులో ఒక ఉద్యోగి రూ.50 లక్షలు నొక్కేసినట్టు సమాచారం. ఈ దొంగతనాన్ని బయటకు పొక్కకుండా తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు.

తండాల్లో నవోదయం జరిగేనా!

ఎక్సైజ్ సిబ్బంది కొరత.. కొరవడిన నిఘా

సారా రహిత రాష్ట్రంగా ఏపీని నిలపాలని కూటమి ప్రభుత్వం కృత నిచ్చయంతో చర్యలకు ఉపక్రమించింది. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నాటుసారా అరికట్టేందుకు 'నవోదయం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే క్షేత్రస్థాయిలో పటిష్ట చర్యలు తీసుకుంటే గాని తండాల్లో నాటు సారా రహిత 'నవోదయం' సాధ్యం కాని పరిస్థితి. సారా తయారీ, రవాణా, విక్రయాల్లో విస్సన్నపేట, రెడ్డిగూడెం, తిరువూరు మండలాలు డేంజర్ జోన్‌లో ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి, విస్సన్నపేట)





ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట డ్రమ్ములు



తండాల్లో సారా తయారీ



విస్సన్నపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్

ఎన్టీఆర్ జిల్లాలో 36 గ్రామాలు సారా రహిత గ్రామాల జాబితాలో ఉండగా వీటిలో 29 గ్రామాలు విస్సన్నపేట, రెడ్డిగూడెం, తిరువూరు, ఎ.కొండూరు ప్రాంతాల్లో ఉన్నాయి. విస్సన్నపేట మండలం తాతాకుంట్ల, వేమిరెడ్డిపల్లి, కలగర, చంద్రుపట్ల, తెల్లదేవరపల్లి, రెడ్డిగూడెం మండల అన్నేరావుపేట తదితర చోట పెద్ద ఎత్తున సారా తయారు కావడంతో ఆ మండలాల్లో గ్రామాలను ఏ గ్రేడ్‌గా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరి విస్సన్నపేట కేంద్రంగా చాత్రాయి, విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాలను కలిపి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లు ఏర్పాటు చేసి సారా నియంత్రణలో కొంత మేర అధికారులు సఫలీకృతులయ్యారు. అనంతరం ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. విస్సన్నపేటలోని ఎక్సైజ్‌స్టేషన్ ఎస్ఈబీ ఏర్పాటు చేశారు. ఏసీపీ స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా వేశారు. దీంతో సారా తయారీ అదుపులోకి వచ్చింది. కొద్ది రోజుల అనంతరం విస్సన్నపేట ఎస్ఈబీ స్టేషన్‌ను విడదీసి చాత్రాయి మండలాన్ని నూజివీడులో కలిపారు. రెడ్డిగూడెం మండలాన్ని మైలవరంలో, విస్సన్నపేట మండలాన్ని తిరువూరులో కలిపి విస్సన్నపేట నుంచి స్టేషన్‌ను ఎత్తివేశారు. దీంతో ఇక్కడ స్టేషన్ లేకుండా పోయింది. ఏ గ్రేడ్ ఉన్న విస్సన్నపేట మండలంలో స్టేషన్ లేకపోవడంతో సారా తయారీ, రవాణాపై నిఘా లేకుండా పోయింది. అధికారులు స్పందించి విస్సన్నపేటలో ప్రత్యేక స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు మండలాలకు ఆరుగురే సిబ్బంది

విస్సన్నపేట, తిరువూరు మండలాల్లో సారా తయారీ, రవాణాను నియంత్రించేందుకు సరిపడా ఎక్సైజ్ సిబ్బంది లేరు. స్టేషన్ పరిధిలో 18 మందికి గాను కేవలం ఆరుగురు మాత్రమే ఉండటంతో సారా నియంత్రణపై సందేహాలు వినిపిస్తున్నాయి.

ముడి పదార్థాలపై నిఘా నిల్

ఎక్సైజ్ సిబ్బంది తండాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్నారే తప్ప సారా తయారీకి వినియోగించే బెల్లం, ఇతర ముడి పదార్థాలపై దృష్టి సారించడం లేదని విమర్శలు ఉన్నాయి. ముడి సరుకులను అడ్డుకుంటే సారా తయారీని సగానికి సగం అరికట్టవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

- ఎస్.శ్రీనివాసరావు (ఎక్సైజ్ సూపరింటెండెంట్)

తండాల్లో నాటు సారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ప్రత్యేక టీమ్స్ వేసి నిరంతరం దాడులు చేస్తున్నాం. విస్సన్నపేట కేంద్రంగా ఎక్సైజ్ స్టేషన్ను తిరిగి ఏర్పాటు చేసేందుకు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్టేషన్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తాం.



క్రైమ్ ఉన్న చోట స్టేషన్ ఉండాలి

బోట్ల శివ సత్యనారాయణ, సామాజిక కార్యకర్త

విస్సన్నపేటలో ప్రత్యేకంగా స్టేషన్ ఉండాలి. మండలంలో నాటుసారా తయారీ, విక్రయం, రవాణా అధికంగా ఉండి అందుకే ఇక్కడే స్టేషన్ ఉండాలి. అధికారులు చర్యలు తీసుకొని విస్సన్నపేటలో స్టేషన్ ఏర్పాటు చేయాలి.

సొసైటీల అధ్యక్ష ఎంపికపై ఉత్కంఠ!

తిరువూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎనిమిది సొసైటీల పాలకవర్గం ఎంపికపై టీడీపీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే వివిధ సొసైటీల అధ్యక్షులుగా కొన్నిపేర్లు తెరపైకి వచ్చినా చివరి నిముషంలో కొత్తపేర్లు వినిపిస్తుండటంతో ఆశావహులు అధ్యక్ష పదవి రేసులో నిలుస్తున్నారు. పార్టీలో అన్నివర్గాల వారికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సొసైటీ అధ్యక్ష పదవికి పార్టీ అధిష్ఠానం సమక్షంలో డ్రాతీయించి రిజర్వేషన్ ప్రకటించారు. నాలుగు సొసైటీలు జనరల్, ఒకటి జనరల్ మహిళ, ఒకటి ఎస్సీ, ఒకటి బీసీకి కేటాయించారు. సొసైటీలకు సంబంధించి మునుకుళ్ల ఎస్సీ, చింతలపాడు బీసీ, లక్ష్మీపురం మహిళకు కేటాయించగా, నడిం తిరువూరు, మల్లేల, ముష్టికుంట్ల, వావిలాల, టేకులపల్లి సొసైటీలను జనరల్‌కు కేటాయించారు. సొసైటీలలో తెలుగుయువతకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ నియోజకవర్గంలో గట్టిగా వినిపిస్తున్నది. పీఏసీఎస్‌ల పాలవర్గం అధిష్టానం నిర్ణయం మేరకు ఉంటుందనే సమాచారంతో సొసైటీలో చోటుదక్కకపోతుందా అన్న ఆశతో కొందరు నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఉపాధి కూలీ దినసరి వేతనం రూ.300 అందాల్సిందే

» క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రణాళికతో వ్యవహరించాలి
» క్రమశిక్షణ రాహిత్యం కనిపిస్తే ఉపేక్షించను
» ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలన్నీ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలి
» తడి-పొడి చెత్త సేకరణ, నిర్వహణ సరైన విధంగా జరగాలి
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కృష్ణలంక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా కూలీలు దినసరి వేతనం రూ.300 హక్కుగా పొందేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సరైన ప్రణాళికతో పనులు చేపట్టేలా వ్యవహరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీవోలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఉపాధి పథకం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, పెన్షన్ల పంపిణీ తదితరాలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులకు సరైన అవగాహన కల్పించి ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 లభించేలా డ్వామా అధికారులు, ఎంపీడీవోలు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. పనిమార్కింగ్, మస్టరింగ్ విషయాల్లో స్పష్టమైన అవగాహనతో వ్యవహరించాలన్నారు. పటిష్ట పర్యవేక్షణ అవసరమని అప్పుడే లక్ష్యాలను చేరుకొనేందుకు వీలవుతుందన్నారు. విధుల నిర్వహణలో ఎక్కడైనా నిర్లక్ష్యం కనిపిస్తే ఉపేక్షించేది లేదని, క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. 286 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 264 ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ) పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. కేంద్రాలు లేని 22 గ్రామ పంచాయతీల్లో వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏవైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తిచేసి, నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. అన్ని కేంద్రాలను రహదారితో అనుసంధానం చేసి ఫెన్సింగ్‌తో పాటు వర్మీ సీడింగ్ జరిగేలా కృషిచేయాలన్నారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై ప్రత్యేక దృష్టిపెట్టండి

గ్రామ పంచాయతీల్లో ప్రతి వెయ్యిమందికి ఒక క్లాప్ మిత్ర వుండేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని గ్రామ పంచాయతీల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అమలుకు చొరవచూపాలని, 100 శాతం తడి, పొడి చెత్తను సేకరించేలా చూడాలన్నారు. అవగాహన శిబిరాల నిర్వహణ, చెత్తను బట్టి వేర్వేరుగా సేకరించడం, బిన్స్‌ను అందుబాటులో వుంచడం వంటివి చేయాలన్నారు. అదేవిధంగా హౌస్‌హోల్డ్ డేటాబేస్ సర్వేలో భాగంగా గృహాల జియో ట్యాగింగ్, డేటా అనుసంధాన ప్రక్రియను పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఉదయం 6కే పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలి

రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో పెట్టుకొని ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని, ఉదయం 6 గంటలకు పంపిణీని ప్రారంభించి, మొదటి రోజే పూర్తిచేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2,29,913 పెన్షన్లకు రూ.98.20 కోట్లు విడుదల చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. టెలీకాన్ఫరెన్సులో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎ.రాము, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

దేవాంతకుడు

(5వ పేజీ తరువాయి)

జాబితాలో మాత్రం ఎవరి ఫోన్ నెంబర్లు సేవ్ చేయలేదు. డిప్యూటీ శ్రీనివాస్ దారుణాలకు సహకరిస్తున్న సిబ్బంది ఫోన్ నెంబర్లన్నింటినీ ఆయన తక్కున నోటితో చెప్పేస్తుండటం గమనార్హం.

మూడు విభాగాలు.. ముగ్గురు

డిప్యూటీ శ్రీనివాస్ ఫోన్ నుంచి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మూడు విభాగాల్లో ఉన్న సిబ్బందికి 'పే'మెంట్లు బాగా జరిగినట్టు తెలిసింది. అన్నదాన విభాగంలో అవుట్‌సోర్సింగ్ ఉదోగి, స్కానింగ్ విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి, మైక్ విభాగంలోని మరో ఉద్యోగికి ఈ చెల్లింపులు జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మూడు విభాగాల్లోనే కాకుండా ఇతర విభాగాల్లోనూ డిప్యూటీ శ్రీనివాస్‌కు సహకరించిన వారున్నారు. నిందితుడు శ్రీనివాస్‌కు పోలీసులు 41ఏ నోటీసు ఇచ్చారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు చెబుతున్నారు. ఇన్నాళ్లూ డిప్యూటీ శ్రీనివాస్‌తో సత్సంబంధాలు నడిపిన దేవస్థాన ఉద్యోగులు ఇప్పుడు వారి పేర్లు బయటకు వస్తాయన్న ఆందోళనలో ఉన్నారు. కొంతమంది స్వయంగా శ్రీనివాస్‌ను కలిసి పోలీసు విచారణలో తమ పేర్లు వెల్లడించొద్దని వేడుకున్నట్టు సమాచారం.

భూమ్‌ధామ్..!

(5వ పేజీ తరువాయి)

బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు వెంబడి భూముల ధరలను సమానంగా పెంచారు. దీంతో విజయవాడలోనే కాకుండా ఉమ్మడి జిల్లాలోనే బందరు రోడ్డు, ఏలూరు రోడ్ల వెంబడి భూముల ధరలు అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి.

- తూర్పు నియోజకవర్గంలోని సూర్యారావుపేటలో గజం రూ.66 వేల నుంచి రూ.69 వేలు, మొగల్రాజపురం పరిధిలో రూ.46 వేల నుంచి రూ.49 వేలు, సీతారామపురం, కస్తూరిబాయిపేట, సూర్యారావుపేటలో రూ.46 వేల నుంచి రూ.49 వేలు, గిరిపురంలో రూ.23 వేల నుంచి రూ.26 వేలు, లబ్బీపేటలో రూ.63 వేల నుంచి రూ.66 వేలు, చంద్రమౌళిపురం, రెవెన్యూ కాలనీ, కేజే గుప్తా ఎంప్లాయిస్ కాలనీల్లో రూ.63 వేల నుంచి రూ.66 వేలు, కృష్ణలంలో రూ.41 వేల నుంచి రూ.43 వేలు, పటమటలో రూ.47 వేల నుంచి రూ.49 వేలు, గాయత్రీనగర్, అశోక్‌నగర్‌లో రూ.56 వేల నుంచి రూ.58 వేలు, ఎస్‌బీహెచ్, పీఅండ్‌టీ కాలనీ, కేపీ నగర్‌లో రూ.56 వేల నుంచి రూ.58 వేలు, సిద్ధార్థ నగర్, నవోదయనగర్, ఎస్‌బీఐ కాలనీల్లో రూ.56 వేల నుంచి రూ.58 వేలు, అయ్యప్పనగర్, అశోక్‌నగర్‌లో రూ.41 వేల నుంచి రూ.43 వేల మేర పెంచారు.
- విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల పరిధిలో బ్రాహ్మణవీధి, మసీదు వీధి, ప్రాంతంలో గజం రూ.28 వేలకు పెంచారు. గాంధీహిల్ ఏరియాలో రూ.28 వేలు, శంకరమఠం వీధి రూ.33 వేలు, లేబర్ కాలనీ రూ.28 వేలు, టన్నెల్ రోడ్డు, ఆంజనేయవాగు, కేఎల్ రావు నగర్ రూ.19 వేలు, గొల్లపాలెం గట్టు, కుమ్మరిపాలెంలో రూ.28 వేలు, రైల్వే క్వార్టర్స్ రూ.64 వేలు, కేదారేశ్వరపేట రూ.28 వేలు, పాత రాజరాజేశ్వరిపేట రూ.17 వేలు, మధురానగర్ పప్పులమిల్లు రూ.31 వేలు, రైల్వేకాలనీ రూ.42 వేలు, బావాజీపేట, గులాబీతోటలో రూ.33 వేలు, పాయకాపురం, రాధానగర్, బర్మాకాలనీ, ప్రజాశక్తి నగర్, ఎల్‌బీఎస్ నగర్, ప్రకాష్‌నగర్‌లో రూ.17 వేల చొప్పున భూముల ధరలు పెంచారు.
- కానూరులో 1-6 వార్డుల పరిధిలో రూ.18 వేలు, 7 నుంచి 12 వార్డుల పరిధిలో రూ.20 వేలు, ఇతర వార్డుల్లో రూ.20 వేలుగా భూముల ధరలు పెంచారు. విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాలైన రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, గన్నవరం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, కొండపల్లి, నున్న తదితర ప్రాంతాల్లో గరిష్టంగా 8 శాతం మేర భూముల ధరలను పెంచారు.
- ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోకి వచ్చే మునిసిపాలిటీల పరిధిలో మాత్రం 10 నుంచి 15 శాతం మేర భూముల ధరలు పెంచారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేట కంచికచర్ల, మైలవరం, నందిగామ, నున్న, పటమట, తిరువూరు, విజయవాడ, విస్సన్నపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో కనిష్టంగా 3 శాతం నుంచి గరిష్టంగా 15 శాతం వరకు భూముల ధరలను పెంచారు. కృష్ణాజిల్లా పరిధిలో మచిలీపట్నం, అవనిగడ్డ, చల్లపల్లి, గన్నవరం, గుడివాడ, కంకిపాడు, కానుమోలు, కౌతవరం, మొవ్వ, పామర్రు, పెడన, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో కూడా 10 నుంచి 15 శాతం మేర భూముల ధరలు పెంచారు.

అల్లరి చేసి.. ఉసురు తీశారు!

అంతంతమాత్రంగా ఆర్థిక పరిస్థితి.. సొంత ఇల్లు ఉండటంతో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీకి ఇంటిని తనఖా పెట్టి రుణం తీసుకున్నాడు. తీసుకున్న అప్పు తాలుకు కిస్తీలు సకాలంలో చెల్లిస్తూ గుట్టుగా జీవనం సాగిస్తున్నాడు. ఒక నెల కిస్తీ ఆలస్యమవడంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు చేసిన ఒత్తిడి, అల్లరితో.. ఇంటా, బయటా పరువు పోవడంతో ఆటో డ్రైవర్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడి కుటుంబం రోడ్డున పడింది.

గుడివాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ మండలం మోటూరు గ్రామానికి చెందిన రావి సుబ్బారావు కుమారుడు సత్తిబాబు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక అవసరాల నిమిత్తం.. 'విస్తార్ ఫైనాన్స్ సంస్థలో ఇంటికాగితాలు తనాఖా పెట్టి రూ.7.80 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పటి నుంచి ప్రతినెల 5వ తేదీన కిస్తీ చెల్లిస్తున్నట్టు మృతుడి భార్య తెలిపింది. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా కిస్తీని చెల్లించేందుకు సత్తిబాబు ప్రైవేట్ ఫైనాన్స్ ప్రతినిధులను మరికొంత గడువు కోరినట్టు చెప్పింది. అయితే ఈనెల 25 వరకు కిస్తీలు చెల్లించకపోవడంతో 'విస్తార్' రికవరీ ప్రతినిధులు రంగంలోకి దిగి పోరంకిలో సత్తిబాబు ఉన్నట్టు

» ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ఆగడాలు
» గడువు కోరినా.. ఇంటికి నోటీసులు
» మనస్తాపంతో ఆటోడ్రైవర్ బలవన్మరణం
» దిక్కులేక వీధిన పడిన కుటుంబం



భార్య, ఇద్దరు పిల్లలతో సత్తిబాబు (ఫైల్‌ఫొటో)

తెలుసుకుని అక్కడికి వెళ్లి నానారభస చేశారని, సత్తిబాబు ఆటోస్టాండ్‌లో ఉండగా వెళ్లి దుర్భషలాడారని దాంతో తీవ్ర మనస్థాపం చెందినట్టు పేర్కొంది. భార్యకు ఆరోగ్యం బాగోలేదని, అందుకే కిస్తీ చెల్లింపులో జాప్యం జరిగిందని వేడుకున్నా కిస్తీ కట్టాలంటూ సత్తిబాబుపై ఒత్తిడి చేశారని పేర్కొంది.

ఇంటికి వచ్చి బెదిరించారు..

ఇటీవల సత్తిబాబు ఇంటికి వెళ్లి కిస్తీ చెల్లించాలని ఫైనాన్స్ ప్రతినిధులు హంగామా చేశారు. "ఇల్లు తాకట్టులో ఉందని, వ్యవహారాలు, ఒప్పందాలు 'విస్తార్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధీనంలో ఉన్నాయి" అని నోటీసులు కూడా అంటించారు. భర్త ఇంట్లో లేరని, వచ్చాక చెప్పి ఫోన్ చేయిస్తానని చెప్పినా ప్రతినిధులు వినకుండా ఇంటికి తాళాలు వేస్తామని బెదిరించారు. రాత్రి పని ముగించుకుని ఇంటి వచ్చిన సత్తిబాబుకు భార్య పద్మావతి 'విస్తారా' ప్రతినిధులు చేసిన హంగామా, గొడవను మొత్తం వివరించింది.

మనస్థాపంతో బలవన్మరణం..

ఇంటా, బయటా అల్లరి అవ్వడంతో మనస్థాపం చెంది మరణమే శరణ్యమని సత్తిబాబు గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యకు ఆరోగ్యం బాగోకపోవడంతో మచిలీపట్నం ఆసుపత్రికి చికిత్సకు వెళ్లిన సమయంలో ఇంట్లోనే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 'విస్తారా' ఫైనాన్స్ ప్రతినిధులు చేసిన అల్లరి, ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నట్టు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టి మరీ ఆత్మహత్య చేసుకున్నాడు. సత్తిబాబు పెట్టిన పోస్టు వైరల్ అయింది. తన ఆవేదన, కుటుంబంపైన ఉన్న ప్రేమను వదులుకోలేక, మరో వైపు 'విస్తార్ ఫైనాన్స్ ప్రతినిధుల ఒత్తిడి, రభస తట్టుకోలేక లోకాన్ని విడిచి వెళ్లిపోయాడు. సత్తిబాబు మరణంతో భార్య, పిల్లలు అనాధలయ్యారు. సత్తిబాబు భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు.



సత్తిబాబు ఇంటికి విస్తార్ సంస్థ అంటించిన నోటీసు

దారుణాలు

(5వ పేజీ తరువాయి)

బ్యాంకులు 0.2 శాతంగా కమీషన్ ఇస్తున్నాయి.

కమీషన్ల కోసం వేధింపులు

మొండి బకాయిలుగా ఉన్న రుణాలను వసూలు చేస్తేనే రికవరీ ఏజెన్సీకి కమీషన్ వస్తుంది. రికవరీ బాధ్యతలను నిర్వహిస్తున్న సంస్థలో పనిచేసే ఉద్యోగులు జీతాలు ఈ కమీషన్లపైనే ఆధారపడి ఉంటాయి. దీంతో ఏజెంట్లు హద్దులు దాటి వ్యవహరిస్తున్నారు. విజయవాడ కేంద్రంగా ఈ రికవరీ ఏజెన్సీల కాల్ సెంటర్లు పనిచేస్తున్నాయి. ఒక్కో కాల్ సెంటర్‌లో మొత్తం 20 మంది వరకు పనిచేస్తున్నారు. అమ్మాయిలు కాల్ సెంటర్‌లో ఉంటూ వరుసగా ఫోన్లు చేసున్నారు. పురుషులు మాత్రం రుణగ్రస్తుల చిరునామాలకు వెళ్లి వీధిరౌడీల్లా ప్రవరిస్తున్నారు. వాళ్ల నోటి నుంచి వచ్చే మాటలు బాధితుల ప్రాణాలు తీస్తున్నాయి. బాధితులు పెద్దగా పోలీసులను ఆశ్రయించకపోవడంతో రికవరీ ఏజెంట్ల వ్యవహారం రోజురోజుకూ శ్రుతి మించుతోంది. మొండి బకాయిల కోసం పనిచేయాల్సిన ఈ రికవరీ ఏజెంట్లు ఒక వాయిదా ఆలస్యమైనా వీరంగం చేస్తున్నారు. రుణం తీసుకున్నవారు చెల్లింపు ఆలస్యమవుతుందని పరిస్థితిని వివరించినా.. వినట్లేదు. వాస్తవానికి ఒక వాయిదా చెల్లింపు ఆలస్యమైతే దానికి నిర్ణీత పరిమితితో లేట్ పేమెంట్ కింద చార్జీలు విధిస్తారు. ఇలా వసూలు చేసుకోవాల్సిన బకాయిల విషయంలోనూ దారుణంగా ఉంటున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఈ తరహా బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. రికవరీ ఏజెంట్లు అంటున్న మాటలను మౌనంగా భరిస్తున్నారు. చేస్తున్న అవమానాలను సహనంతో భరిస్తున్నారు. మనస్తాపం చెందిన వారు మాత్రం ప్రాణాలు తీసుకుంటున్నారు.

కిటకిట..!

(5వ పేజీ తరువాయి)

సంఖ్యలో జరుగుతుండటంతో ఒక్కసారిగా ఒత్తిడి పెరిగింది. సర్వర్‌కు అవాంతరం ఏర్పడింది. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకబిగిన సర్వర్ నిలిచిపోయింది. అయినప్పటికీ సందర్శకులు పడిగాపులు పడ్డారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల నుంచి బయటకు కదల్లేదు. సర్వర్ సాయంత్రం 6 గంటల వరకు రాకపోవటంతో చాలామంది ఆందోళన చెందారు. విజయవాడతో పాటు గ్రేటర్ విలీన ప్రతిపాదిత ప్రాంతాల్లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శుక్రవారం రాత్రి 9.30 వరకు రిజిస్ట్రేషన్లు జరగగా, అర్ధరాత్రి వరకు కూడా అధికారులు పనిచేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

వైద్యానికి సీఎం సాయం

కంకిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొడవర్రుకు చెందిన నల్లూరి కుమారి ఆసుపత్రి ఖర్చులకు అవసరమైన రూ. 65 వేలు సీఎంఆర్ఎఫ్ అనుమతి పత్రాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం అందజేశారు. పోరంకి పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గొడవర్రు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



అనుమతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

దుర్గమ్మ దర్శనానికి వచ్చి గుండెపోటుతో మృతి

వన్‌టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దుర్గమ్మను దర్శించుకోవటానికి వచ్చిన పెనమలూరుకు చెందిన జెట్టి ప్రసాద్ (40) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పెనమలూరు ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ సమీపంలో ఉండే జెట్టి ప్రసాద్ దుర్గమ్మకు మొక్కు చెల్లించుకునేందుకు భార్యతో కలిసి దుర్గగుడికి వచ్చాడు. అతను పొంగలి షెడ్డు సమీపంలో ఉండగా గుండెపోటు వచ్చింది. భక్తులు ఆలయ సిబ్బందికి సమాచారం తెలపగా అంబు లెన్స్‌లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

కంకిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలపై ఉద్యమించే ఏకైక పార్టీ సీపీఎం అని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పంచకర్ల రంగారావు అన్నారు. స్థానిక మండేపూడి నాగభూషణ్ రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ, ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరగనున్న 27వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి తాడంకి నరేష్, చిక్కవరపు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు చేయూత నివ్వడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చని లయన్స్ జిల్లా కార్యవర్గ సభ్యుడు గూడపాటి రత్నశేఖర్ అన్నారు. ఏపూరులోని ఆదిత్య దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు ఎన్నారై వల్లకొండ రఘుచరణ్ పుట్టినరోజు సందర్భంగా హనుమాన్‌జంక్షన్ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు అక్కినేని రాఘవేంద్రరావు, మత్తి రాంబాబు చేతుల మీదుగా నిత్యావసరాలను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తమిరి రమేష్, కట్టా నరేంద్ర, ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.



లండన్‌లో కానూరు స్కాట్స్‌పైన్ విద్యార్థులు

బ్రిటన్ పార్లమెంట్ డిబేట్‌లో కానూరు స్కాట్స్‌పైన్ విద్యార్థులు

పెనమలూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : బ్రిటన్ పార్లమెంట్ లండన్‌లో జనవరి 24నుంచి 30వరకు జరిగిన డిబేట్ కార్యక్రమంలో కానూరు స్కాట్స్‌పైన్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారతదేశంలోని విద్యా ప్రమాణాలు, ఆర్థిక వ్యవస్థ, ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ వాతావరణం తదితర అంశాల విద్యార్థులు మాట్లాడినట్లు పాఠశాల డైరెక్టర్ వీరమాచనేని శాంతి శుక్రవారం తెలిపారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వీరపనేనిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో లైన్ మెయింటెనెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్న ట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు గ్రామంతో పాటు తెంపల్లి, మర్లపాలెం హౌసింగ్ కాలనీ, బల్లిపర్రు, మెట్లపల్లి ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

అధికారుల అలసత్వం!

● ఉయ్యూరు, మండల పరిధిలో కానరాని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్

● ఎక్కడ ఫ్లెక్సీలు, బ్యానర్లు అక్కడే

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

గుంటూరు, కృష్ణాజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రవర్తనా నియమావళి జనవరి 29 నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ ఉయ్యూరు పట్టణ, మండల పరిధిలో నియమ, నిబంధనలు అమలు చేయడంలో అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. నియమావళి ప్రకారం రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగువేసి, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు తొలగించాల్సి ఉంది. కాని నియమావళికి విరుద్ధంగా ప్రతిగ్రామం, ఉయ్యూరు పట్టణంతో పాటు మండల పరిధిలో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి ఫ్లెక్సీలు, కటౌట్లు ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్నప్పటికీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గండిగుంట సెంటర్ సమీపాన జాతీయ రహదారిపై రోడ్డుమ్యాప్ తెలిపే బోర్డుపైన కూడా రాజకీయ నాయకుల ఫోటోలతో ఫ్లెక్సీ అతికించడంతో గ్రామాలకు వెళ్లే సూచిక తెలియక వాహనాలపై వెళ్లేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. ఉయ్యూరు పట్టణంలో ప్రధాన రహదారితో పాటు, కాటూరు రోడ్డు, ఇతర రహదారులో నాయకుల ఫోటోలతో బ్యానర్లు, ఫ్లెక్సీలు, భారీ కటౌట్లు సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు వేలాడుతూ, ప్రమాదకరంగా ఉన్నాయి. పట్టణంలో కటౌట్లు తొలగించడంలో నగర పంచాయతీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కటౌట్లు, ఫ్లెక్సీలు తొలగించమని వాటిని ఏర్పాటు చేసిన వారికి తెలిపామని అధికారులు చేతులు దులుపుకోవడం విశేషం.



ఆకునూరు సెంటర్‌లో తొలగించని ఫ్లెక్సీలు



ఉయ్యూరులో సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు కట్టిన ఫ్లెక్సీలు

ఫ్లెక్సీల తొలగింపులో పక్షపాత వైఖరి

● **కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్**

నగర పంచాయతీ పరిధిలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీల తొలగింపులో అధికారులు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని ఉయ్యూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్ సోలె సురేశ్ కౌన్సిల్ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు, కటౌట్లు తొలగించకుండా కేవలం ప్రతిపక్ష పార్టీల ఫ్లెక్సీలు మాత్రమే తొలగించడంపై కమిషనర్ వెంకటేశ్వరరావును నిలదీశారు ఫ్లెక్సీలు కటౌట్లు తొలగించాలని సంబంధితులకు తెలియజేశామని ఉన్నవి కూడా తొలగిస్తామని కమిషనర్ జవాబిచ్చారు. ఈ నెల 8 నుంచి వీరమ్మ తిరునాళ్ల జరుగుతున్న సందర్భంగా శానిటేషన్ ఇతర వసతులకు లక్ష రూపాయలు కేటాయిస్తూ కౌన్సిల్ తీర్మానాన్ని ఆమోదించారు.

కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



జంక్షన్‌లో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవ సభలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం రోజును రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించి ఆర్యవైశ్యులకు సముచిత స్థానం ఇవ్వడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేత నారికమల్లి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ఆర్యవైశ్యుల సహకారం మరువలేనిదన్నారు. గాంధీజీ కాంస్య విగ్రహాన్ని గన్నవరం సెంటర్‌లో ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. దానికి గన్నవరం, హనుమాన్‌జంక్షన్ ప్రాంత ఆర్యవైశ్యులు ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు. ముందుగా ఆయన కల్యాణ మండపంలోని వాసవీమాత ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలతో పాటు తీర్థ ప్రసాదాలు ఆశీస్సులు అందజేశారు. వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు, కార్యకర్తలు జంక్షన్ నాలుగు రోడ్లలో వాసవీ మాతకు పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయి కల్యాణి, దయాల రాజేశ్వరరావు, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల గోపాలకృష్ణ, వీరమాచనేని సత్యప్రసాద్, జనసేన నాయకులు చలమలశెట్టి రమేశ్‌బాబు, నూలు నరసింహారావు, ఆర్యవైశ్య సంఘం నేతలు పైడి సుధాకర్, కొనకళ్ల రాజశేఖర్, బొమ్మిశెట్టి రామారావు, చామర్తి రాంబాబు, తవ్వా పూర్ణచంద్రరావు, తవ్వా కోటేశ్వరరావు, చామర్తి లోకనాథ్, ఆర్యవైశ్య మహిళా మండలి, కల్యాణ మండపం పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వెంకమ్మ పేరంటాలమ్మ తల్లి దేవస్థానంలో..

ప్రసాదంపాడు : వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో భాగంగా శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ తల్లి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కొల్లా ఆనంద్, సాయి రామరాజు, సాంబు, కొంగన రవి, సర్నాల బాలాజీ, ఆలయ ఈవో, కూటమి నాయకులు పాల్గొన్నారు.

276 మందికి వైద్యపరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ మాదల రోహిణి

గన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు విస్తృతంగా అందించాల్సిన అవసరత ఉందని సర్పంచ్ మాదల రోహిణి అన్నారు. మండలంలోని పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీ వద్ద డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల బోధన ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రోహిణి మాట్లాడుతూ, వ్యాధులు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయటంపై పిన్నమనేని సిద్ధార్థ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. 276 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను అందజేశారు. డాక్టర్లు ఆర్.శిల్పా, కె.అఖిల్, వై.రమణి, శ్రీనివాస్, కె.ప్రవల్లిక వైద్యసేవలు అందించగా ఉప సర్పంచ్ కుంటముక్కల శివయ్య, కార్యదర్శి ప్రసాద్, మాదల సాంబశివరావు పాల్గొన్నారు.

చేతి పంపు మరమ్మతులు చేపట్టాలి



చేతి పంపు వద్ద నిరసన తెలుపుతున్న బండారుగూడెం ఎస్సీ కాలనీ మహిళలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : బండారుగూడెంలోని ఎస్సీ కాలనీలో తాగునీటికి ఇబ్బందిగా ఉంటోందని, నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని తాగు నీరందించే చేతి పంపు వద్ద వినతిపత్రం ఉంచి సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. కొన్ని రోజులుగా చేతిపంపు మరమ్మతులకు గురైందని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోటి జయమ్మ, అలుగుల బాలస్వామి, బల్లవరపు మాణిక్యమ్మ, రమేష్, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి పెంపొందించుకోవాలి : వైవీబీ



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న వైవీబీ

ఉయ్యూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు క్రీడలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆకునూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పెనమలూరు నియోజకవర్గ బాలికల సబ్‌జోన్ ఆటల పోటీలు శుక్రవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ గోలి వసంతకుమార్, వెలగపూడి వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీధర్, పాఠశాల హెచ్ఎం కొడాలి శ్రీరమ, జోన్‌గేమ్స్ అధ్యక్షురాలు ఎం దుర్గాభవాని, సెక్రటరీ మురళి, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు. క్రీడలకు హరివిల్లు అధినేత వేములపల్లి లక్ష్మణచౌదరి సహాయ సహకారాలు అందజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలి

ఉయ్యూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు అందించే సమయంలో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు లేకుండా పంపిణీ చేయాలని ఎంపీడీవో శేషగిరిరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలుపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ కార్యాలయల్లో రాజకీయ నాయకుల చిత్రపటాలు లేకుండా చూడాలని ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలన్నారు.

ఉంగుటూరు : మండల వ్యాప్తంగా శనివారం నిర్వహించే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కె.జోగేశ్వరరావు గ్రేడ్-1, గ్రేడ్-5 కార్యదర్శులకు సూచించారు. ముఖ్యంగా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు లేకుండా పంపిణీ చేయాలన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ● మండలంలో మూతపడిన చెత్తసంపద కేంద్రాలను వాడుకలోకి తీసుకురావాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కె.జోగేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, సూపరింటెండెంట్ జేవీఎస్ఆర్‌కే ప్రసాద్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు జి.శ్రీలక్ష్మి, బి.రత్నశేఖర్, సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కంకిపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య అన్నారు. మండలంలోని ఉప్పలూరు ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు కనగాల కృష్ణమోహన్ కుమార్తె శ్రీవిద్య అందజేసిన ప్రింటర్‌ను పాఠశాల విద్యార్థులకు ధనయ్య శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కనగాల సుబ్బారావు, కొండవీటి శివయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ నరసింహ పల్లపు వెంగళరావు, శనగశెట్టి ప్రసాద్, రాంప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలు పరిష్కరించాలి



సబ్ రిజిస్ట్రార్ జయరాజుకు వినతిపత్రం అందజేస్తున్న సాగర్ ఎడమ కాలువ పీసీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్ /రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో తొలి విడత నిర్వహించిన రీ సర్వే కారణంగా ఆన్‌లైన్‌లో భూములకు సంబంధించిన ఎల్‌పీ ఎం, సర్వే నెంబర్లు కనిపించక రైతులు పడుతున్న ఇబ్బందిని పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవా లని టీడీపీ బాపులపాడు మండల నాయకులు తహసీల్దార్ బి.మురళీకృష్ణను కోరారు. శుక్రవారం సాగర్ ఎడమ కాలువ పీసీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

● రంగన్నగూడెంలోని వ్యవసాయ భూముల మార్కెట్ విలువ పెంచాలని కోరుతూ సబ్‌రిజిస్ట్రార్ జయరాజుకు శుక్రవారం సాగర్ ఎడమ కాలువ పీసీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ వినతిపత్రం అందజేశారు. కానుమోలులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ జయరాజును కలిసి జిల్లా రిజిస్ట్రార్‌కు అందజేసిన కాపీతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆయనతో పాటు సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, పాలసొసైటీ అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అద్భుత బాలయేసు తిరునాళ్ల ప్రారంభం సందర్భంగా దివ్య బలిపూజ నిర్వహిస్తున్న ఏలూరు మేత్రాసన ఫాదర్ బాల, విచారణ ఫాదర్ జోసఫ్‌తంబి

అద్భుత బాలయేసు తిరునాళ్ల ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : పెరికీడు జ్యోతినగర్ చర్చిలో అద్భుత బాలయేసు తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు మేత్రాసన ఫాదర్ బాల ఆధ్వర్యంలో స్వస్థత ప్రార్థనలు, ప్రత్యేక దివ్యబలిపూజ నిర్వహించారు. శాంతిసందేశాన్ని వినిపించి అద్భుత బాలయేసు ప్రార్థనతో ఎంతో మంది విశ్వాసులకు మేలు జరిగిందన్నారు. విచారణ గురువు ఫాదర్ జోసఫ్‌తంబి ఆధ్వర్యంలో బాలయేసు గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో జెఎంజె సిస్టర్స్ ఆంథోనమ్మ, సిస్టర్ మంజు, సిస్టర్ భాగ్య, సిస్టర్ అనంతమ్మ, సిస్టర్ అన్నమ్మలు పాల్గొన్నారు.

4న చిక్కవరం శ్రీక్షేత్రంలో రథసప్తమి మహోత్సవాలు

గన్నవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో ఫిబ్రవరి 4న రథసప్తమి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు చిట్టినేని వంశీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తేదీ ఉదయం నుంచి హోమాలు, పూర్ణాహుతి, శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి స్వామివార్ల విగ్రహస్థాపన ఉంటుందని, సూర్యకిరణ స్పర్శదర్శనం, చిన్న పిల్లలచే సామూహికంగా సూర్య నమస్కారాలు, 108 మందితో దేవాలయం వద్ద స్వామివారికి సామూహిక పొంగళ్లు ఉషా, పద్మిని సమేత సూర్యనారాయణ స్వామి కళ్యాణం అనంతరం ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ
ఇ ప్రొక్యూర్ మెంట్ నోటీసు

ఇ-ప్రొక్యూర్ మెంట్ ద్వారా శ్రీ రామాలయం, ఆత్కూరు గ్రామం, ఉంగుటూరు మండలం, కృష్ణాజిల్లా నందు దేవాలయమునకు అభివృద్ధి పనులు చేయుటకు రూ. 15.00 లక్షలు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్ సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

ఇట్లు : కార్యనిర్వహాక అధికారి



మిద్దెతోట.. ఆరోగ్యానికి కోట!





విశ్రాంత ఉపాధ్యాయిని అవిశ్రాంత శ్రమకు ప్రతిఫలంగా అందాల వనం



గాంధీనగర్‌లో తన ఇంటి మిద్దెపై అందాల వనంలా ఉన్న తోటను చూపుతున్న విశ్రాంత ఉపాధ్యాయిని ముంతాజ్ బేగం, ఇన్‌సెట్‌లో వర్మీ కంపోస్టు

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం టౌన్): కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడంపై ఉన్న మక్కువతో హైస్కూల్ విశ్రాంత సైన్స్ ఉపాధ్యాయిని ముంతాజ్ బేగం గాంధీనగర్‌లో తనకున్న చిన్న ఇంటి మిద్దెపైన వందల మొక్కలు పెంచుతున్నారు. రోజుకు 5 గంటల సేపు ఆమె మొక్కలతోనే గడుపుతుంటారు. తోటకూర, పాలకూర, చుక్కకూర, గోంగూర, బచ్చలి, వంకాయ, టమోటా, మిర్చి, అలచంద, క్యాబేజీ, మునగ, బీర, దోసకాయలు పండిస్తున్నారు. మామిడి, అరటి, జామ, స్టార్, సపోటా, మల్బరీ, తెల్లనేరేడు, వాటర్ యాపిల్, అంజీరా, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, కమల, బత్తాయి, స్వీట్ లెమన్, చెర్రీ మొక్కలను పెంచుతున్నారు. ఇంటి వద్దే వర్మీ కంపోస్టు తయారు చేసి మిద్దెపైన మొక్కలకు సేంద్రియ ఎరువుగా వాడుతున్నారు. వేపపిండి, ఎప్సంసాల్ట్, ఎండిన ఆవుపేడ, తోట నుంచి వచ్చే ఆకులు, ఉల్లిపొట్టు, వేరుశెనగ, ఆవ, కొబ్బరి, నువ్వుల చెక్కలను నానబెట్టి ఎరువులు తయారు చేస్తున్నారు. మిద్దెతోటలో పండించిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఆరోగ్యానికి పెట్టని కోట అని, అందరూ తమ మిద్దెలపై తోటలు పెంచాలని ముంతాజ్ పిలుపునిస్తున్నారు.

సామాజిక బాధ్యతకు సరికొత్త అర్థం!

- విద్యుత్‌సౌధలో ఇండోర్ స్టేడియం నిర్మాణం
- ఏపీ ట్రాన్స్‌కో సీఎస్ఆర్ నిధులు రూ.3.30 కోట్లు ఖర్చు
- మరికొద్ది రోజుల్లో స్టేడియం ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)కు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు కొత్త అర్థం చెప్పారు. పేదల సామాజిక అవసరాల కోసం ఉపయోగించాల్సిన నిధులను దారి మళ్లించారు. విజయవాడ విద్యుత్‌సౌధలో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం కోసం రూ.3.30 కోట్ల సీఎస్ఆర్ నిధులను ఖర్చు పెట్టారు. ఇండోర్ స్టేడియానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించినప్పటికీ సీఎస్ఆర్ నిధులు ఉపయోగించడం వివాదాస్పదమవుతోంది. రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ చేతుల మీదుగా మరికొద్ది రోజుల్లో ఈ ఇండోర్ స్టేడియం ప్రారంభం కానుంది. అత్యంత రహస్యంగా ఇండోర్ స్టేడియాన్ని సీఎస్ఆర్ నిధులతో పూర్తి చేయడం విమర్శలకు దారి తీస్తోంది. ఏ సంస్థ అయినా కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)గా తన ఆదాయంలో 2 శాతం నిధులను సామాజిక అవసరాలను తీర్చటం కోసం ఖర్చు చేయాలి. కానీ, ట్రాన్స్‌కో మాత్రం సొంత ఉద్యోగుల ఆటవిడుపు కోసం తమ ప్రాంగణంలో ఏర్పాటు చేసే ఇండోర్ స్టేడియానికి సీఎస్ఆర్ నిధులను ఖర్చు పెట్టింది. విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్ వంటి సంస్థలు ఇండోర్ స్టేడియాలు నిర్మిస్తాయి. కానీ సొంత అవసరాలకు సీఎస్ఆర్ నిధులు ఉపయోగించడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజా ప్రతినిధులకు ఈ వ్యవహారం తెలిస్తే గోలపెట్టే అవకాశం ఉందని, అనవసర వివాదం కొనితెచ్చారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఇండోర్ స్టేడియానికి అయిన ఖర్చును ప్రభుత్వ నిధుల ద్వారా సర్దుబాటు చేసుకునేందుకు ప్రయత్నించాలని, సీఎస్ఆర్ నిధులను తిరిగి వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమతోంది.

2018లో రెండున్నర కోట్లు కేటాయించిన టీడీపీ ప్రభుత్వం

2018లో టీడీపీ ప్రభుత్వం ఇండోర్ స్టేడియానికి రూ.2.50 కోట్లను కేటాయించింది. అప్పట్లో కాంట్రాక్టు అగ్రిమెంట్ కూడా ఇదే మొత్తానికి జరిగింది. ఫౌండేషన్ పనులు జరిగాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తిగా ఆగిపోయాయి. 2022-23లో సొంత సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1.80 కోట్లను ఉపయోగించుకునేలా ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ తర్వాత మరో రూ.1.50 కోట్ల సీఎస్ఆర్ నిధులను వాడారు. మొత్తంగా రూ.3.30 కోట్ల సీఎస్ఆర్ నిధులను వాడారు.

జగన్‌కు సిగ్గుండాలి!

- విద్యార్థులకు రూ.కోట్లు బకాయిలు పెట్టి.. 'ఫీజు పోరు'కు పిలుపా?: టీఎన్ఎస్ఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి



గుడివాడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు కోట్లాది రూపాయల ఫీజులు బకాయిలు పెట్టి, నేడు ఫీజు పోరు పేరుతో ఆందోళనకు పిలుపునివ్వడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సిగ్గుండాలని టీఎన్ఎస్ఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ సత్యసాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రజావేదికలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడివాడలోని వైసీపీ దొంగల ముఠా అంతా కలిసి ఫిబ్రవరి 5వ తేదీన ఆ పార్టీ చేపడుతున్న ఫీజు పోరు కార్యక్రమం పోస్టర్లను విడుదల చేసిందన్నారు. గతంలో చంద్రబాబు అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విద్యాదీవెనగా మార్చి కొత్తగా తానేదో కొత్త పథకాన్ని పెట్టినట్టు జగన్‌రెడ్డి ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సకాలంలో వైసీపీ ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాల యజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వకుండా పరీక్షలు రాయనివ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టాయన్నారు. జగన్‌రెడ్డి పదవి పోయే ముందు ఫీజు బకాయిలను జమ చేయకుండా బటన్ నొక్కి డ్రామాలు ఆడారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులను కళాశాలకు దూరం చేసిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. ఐదేళ్లలో జగన్‌రెడ్డి రూ.4,271 కోట్లు బకాయిలు పెట్టారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ.788 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసిందని, వివిధ కళాశాలల్లో నిలిచిపోయిన 10లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను విద్యార్థులకు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. విద్యార్థులను ఫీజు కోసం ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని కూటమి ప్రభుత్వం ఆదేశించిందన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రి ఫరూక్ తదితరులు

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

లబ్బీపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ అధ్యక్షతన లబ్బీపేటలోని ప్రధాన కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొన్నారు. రాబోయే సంవత్సరంలో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ప్రస్తుతం అందిస్తున్న పథకాలపై అన్ని జిల్లాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఓబీఎంఎస్‌పై వివరించారు. మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నవదిన ప్రార్థనలు ప్రారంభం

గుణదల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'తన రక్షణ ప్రణాళికను కొనసాగించడానికి మరియమాతను తల్లిగా దేవుడు ఎన్నుకున్నారు. స్త్రీలందరిలో మరియమాత ధన్యురాలు. క్రీస్తు తల్లి అయిన మరియమాతను గౌరవిస్తే దేవుడి అనుగ్రహాలు తప్పక లభిస్తాయి. లూర్దుమాత దర్శన భాగ్యం పొందిన వారు వరాలు పొందుతారు.' అని విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్ద కథోలిక పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన గుణదల లూర్దుమాత మహోత్సవాల నవదిన ప్రార్థనలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుణ్యక్షేత్రం ప్రధాన చర్చి వద్ద మరియమాత పతాకాన్ని బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, వికర్ జనరల్ మేకపాం గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, డయాసిస్ ఎడ్యుకేషన్ డెస్క్ డైరెక్టర్ కొలకాని మరియప్ప, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తోట సునీల్ రాజు ఆవిష్కరించారు. జపమాలతో భక్తులు కొండ మధ్యలోగల మరియమాత స్వరూపం వద్దకు చేరుకున్నాక, లూర్దుమాత స్వరూపం వద్ద సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. జగద్గురువులు పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ 2025ను జూబ్లీ సంవత్సరంగా ప్రకటించారని బిషప్ తెలిపారు. ఈ ఏడాది 101వ గుణదలమాత మహోత్సవాలను భక్తులు దిగ్విజయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నేటి నుంచి తొమ్మిదిరోజులు నిర్వహించే నవదిన ప్రార్థనలతో లూర్దుమాత తిరునాళ్లకు భక్తులను సంసిద్ధులను చేస్తామన్నారు.



నవదిన ప్రార్థనలకు హాజరైన భక్తులు

మానవాళిని దేవునివైపు నడుపుతున్న దిక్సూచి మరియమాత

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మానవాళిని దేవునివైపు నడుపుతున్న దిక్సూచి మరియమాత అని విజయవాడ డయాసిస్ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. శారదానగర్ ఆర్‌సీఎం విచారణ చర్చిలో సాగరమాత మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక దివ్యబలిపూజను ఆయన సమర్పించారు. దేవునికి, భక్తులకు మధ్య మరియమాత వారధిగా ఉండి భక్తులకు మనోధైర్యాన్ని కలిగిస్తుందన్నారు. శారదానగర్ సాగరమాత విచారణ గురువు జానీడిక్రూస్, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆర్‌సీఎం చర్చిల విచారణ గురువులు ఈ పూజాబలిలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, పేర్ని కిట్టు, మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వ రమ్మ, హోలీక్రాస్‌చర్చి, నిర్మలా కాన్వెంట్ సిస్టర్లు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి మేరీమాత తేరు ప్రదక్షిణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సాగరమాత వేడుకల్లో ప్రసంగిస్తున్న బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

చదువుకోసం పరాయిదేశానికెళ్లి..
ప్రమాదానికి బలయ్యారు

- ఐర్లాండ్‌లో చెట్టును ఢీకొన్న కారు.. జగ్గయ్యపేట, గుంటూరు యువకుల దుర్మరణం



చిట్టూరి భార్గవ్ (ఫైల్)

జగ్గయ్యపేట/జగ్గయ్యపేటరూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చదువుకునేందుకు ఐర్లాండ్ దేశం వెళ్లిన జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామానికి చెందిన యువకుడు, గుంటూరుకు చెందిన మరో యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఐర్లాండ్‌లోని కార్లో పట్టణంలో సౌత్‌ఈస్ట్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో చదువుకునేందుకు మూడేళ్లక్రితం గండ్రాయికి చెందిన చిట్టూరి భార్గవ్(25) వెళ్లాడు. ఆ దేశ కాలమానం ప్రకారం తెల్లవారుఝామున 1.15 గంటలకు తన స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా రాతో అనే ప్రాంతంలో చెట్టును ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగిందని తండ్రి సాయిబాబుకు అక్కడ యూనివర్సిటీ నుంచి సమాచారం వచ్చింది. ఈ సమయంలో ఐర్లాండ్‌లో విపరీతమైన మంచు కురుస్తుందని, చెట్టును గుర్తించక ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాదంలో భార్గవ్(25)తోపాటు గుంటూరుకు చెందిన చెరుకూరి సురేష్(25) మృతి చెందినట్టు సమాచారం అందింది. కారులో ప్రయాణిస్తున్న వీరి స్నేహితులు ఒక యువతి, మరో యువకుడు తీవ్రగాయాలతో బయటపడ్డారు. వారికి ప్రాణాపాయం లేదని తెలుస్తుంది.

గండ్రాయిలో విషాదం

రైతు కుటుంబం నుంచి ఉన్నత విద్య చదవాలని ఐర్లాండ్ దేశానికి వెళ్లి మృత్యువాత పడిన చిట్టూరి భార్గవ్ (25) మరణ వార్త గండ్రాయి గ్రామంలో విషాదాన్ని నింపింది. చిట్టూరి భార్గవ్ తండ్రి సాయిబాబా, ఆయన సోదరుడు నరసింహారావులు గ్రామంలో వివాదాలకు దూరంగా అందరికీ తలలో నాలుకలా ఉంటారు. వ్యవసాయం అంతగా లాభించకపోవటంతో సాయిబాబా జగ్గయ్యపేటలో వ్యాపారం చేస్తున్నారు. పెద్ద కుమారుడు భార్గవ్‌ను ఎంఎస్ కోసం ఐర్లాండ్ పంపారు. చదువు కొద్ది నెలల్లో పూర్తి కానుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న తరుణంలో ఇలా ప్రమాదం రూపంలో మృత్యువు కబళించడం కుటుంబాన్ని కలిచివేస్తోంది.

మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు

ప్రమాదం విషయం తెలియగానే భార్గవ్ బంధువులు ఐర్లాండ్ నుంచి భౌతికకాయాన్ని తెప్పించాలంటూ టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాంను కలిశారు. ఆయన వెంటనే మంత్రి నారా లోకేశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఐర్లాండ్‌లో భారత రాయబారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆ దేశంలో లాంఛనాలు త్వరితగతిన పూర్తిచేసి భౌతికకాయాన్ని సాధ్యమైనంత త్వరగా తెప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.



డైరీని ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ సంస్థ ప్రతినిధులు

క్రెడాయి డైరీలో నిర్మాణ రంగ
సమస్త సమాచారం

- సంస్థ విజయవాడ అధ్యక్షుడు దాసరి రాంబాబు

గుణదల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని నూతన సంవత్సర డైరీలో పొందుపరిచామని క్రెడాయి విజయవాడ అధ్యక్షుడు దాసరి రాంబాబు తెలిపారు. క్రెడాయి సంస్థ రూపొందించిన నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఓ హోటల్‌లో నిర్వహించారు. క్రెడాయి పాతికేళ్ల ఉత్సవాన్ని పురస్కరించుకుని 2025 డైరీని ఒక నిర్మాణ రంగం నిఘంటువుగా తయారు చేశామని రాంబాబు తెలిపారు. ఇందులో నిర్మాణ రంగ జీవోలు, జీఎస్టీ సమాచారం పొందుపరిచామన్నారు. క్రెడాయి ఏపీ అధ్యక్షుడు వైవీ రమణారావు, విజయవాడ కోశాధికారి తుమ్మల వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడు కె.రఘురాం, సంయుక్త కార్యదర్శులు జీఎస్ సాయిరాం, బి.కేశవచంద్ర, బి.పవన్‌కుమార్, పూర్వ అధ్యక్షుడు కె.రాజేంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయానికి ఆస్కారం

ప్రభుత్వాసుపత్రి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నున్న-గుడివాడ 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్, ఆధునీకరణ సాంకేతిక మరమ్మతులు చేయాల్సినందున గుడివాడలో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా ఆపేస్తామని ఏఈ ఎస్.కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సాధారణ విద్యుత్ సరఫరాకు అంతరాయం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. అయితే తప్పనిసరి పరిస్థితుల్లో 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలైన పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ, చిగురుకోటలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.

లాగేస్తేపోలా!

- పంచాయతీ ఎన్నికల్లో టీడీపీకి పోటీలేకుండా పావులు కదుపుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్
- వైసీపీ సర్పంచ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులను పార్టీలో చేర్చుకునే వ్యూహం
- కంకిపాడులో ఖాళీ కానున్న వైసీపీ?

(ఆంధ్రజ్యోతి-కంకిపాడు): కంకిపాడులో నామమాత్రంగా ఉన్న వైసీపీ త్వరలో ఖాళీ కానుందని ప్రచారం జరుగుతోంది. వైసీపీని పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేయాలన్న పట్టుదల, లక్ష్యంతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పావులు కదుపుతున్నారని సమాచారం. కంకిపాడు సర్పంచ్ బాకి రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవితో పాటు పలువురు వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకుని, అంతంతమాత్రంగా ఉన్న వైసీపీని దెబ్బతీయాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే ముందుకు వెళ్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే టీడీపీ సీనియర్ నాయకుడు ఒకరు గ్రామంలోని వైసీపీ నాయకులతో సమావేశమయ్యారని విశ్వసనీయ సమాచారం. వచ్చే జనవరిలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కంకిపాడులో టీడీపీకి పోటీ లేకుండా వైసీపీ నాయకులను తమ పార్టీలోకి లాగేసే దిశగా అడుగులు వేస్తున్నారని తెలిసింది.

ఇబ్బంది పెట్టిన వారిని ఎలా తీసుకుంటారు

స్థానిక టీడీపీ నాయకులు పలువురు గురువారం రాత్రి ఆర్యవైశ్య ప్రార్థన మందిరంలో సమావేశమయ్యారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమను ఇబ్బంది పెట్టిన వైసీపీ నాయకులను పార్టీలోకి ఎలా తీసుకుంటారన్న దానిపై చర్చించినట్లు సమాచారం. ఒకవేళ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వైసీపీ నాయకులను టీడీపీలోకి తీసుకున్నా వారితో ఎలా కలిసి పనిచేస్తామని ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. బోడె ప్రసాద్‌ను కలిసి తమ గోడు విన్నవించుకునేందుకు స్థానిక నాయకులు సిద్ధమయ్యారని సమాచారం.

సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఓకే..

కంకిపాడు సర్పంచ్ బాకి రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవిని టీడీపీలోకి తీసుకునేందుకు స్థానిక టీడీపీ నాయకత్వం సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. రెండో వార్డు సభ్యుడు చిట్టూరి కోటయ్యబాబు, ఎంపీటీసీ -4 కంకిపాటి పద్మావతి భర్త కంకిపాటి రమేష్‌ను పార్టీలోకి తీసుకోవడం సరికాదని ఆ పార్టీ నాయకులు అభ్యంతరం చెబుతున్నారని తెలిసింది. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వ్యతిరేకంగా చిట్టూరి కోటయ్యబాబు గ్రూపుల్లో అనేక సందేశాలు పెట్టారని, గత పంచాయతీ ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందుల పాల్జేశారని ఆరోపిస్తున్నారని సమాచారం.

అరటి.. అబ్బురం!

- హస్తానికి నాలుగు డజన్ల కాయలు





అరటికాయల హస్తాన్ని చూపుతున్న చోడవరం రైతు చాగర్లమూడి మురళీకృష్ణ

(ఆంధ్రజ్యోతి-పెనమలూరు): అరటి గెలలో ఒక్క హస్తానికే నాలుగు డజన్ల అరటికాయలు కాయడం చూపరులను అబ్బురపరుస్తోంది. పెనమలూరు మండలం చోడవరానికి చెందిన చాగర్లమూడి వెంకట మురళీకృష్ణకు చెందిన అరటి తోటలో ఒక చెట్టుకు గెల పక్వానికి రావడంతో రెండు రోజుల క్రితం దానిని కోశాడు. గెల పూర్తిగా పక్వానికి వచ్చాక పరిశీలిస్తే ఒక్క హస్తానికి నాలుగు డజన్ల కాయలు ఉన్నాయి. నేలలో ఎక్కువ బలం, కొన్ని రకాల వాతావరణ పరిస్థితుల వల్ల అరుదుగా జరుగుతుంటాయని ఏవో శైలజ తెలిపారు.

కుంభమేళాకు పర్యాటకశాఖ
ప్రత్యేక బస్సులు

వన్‌టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లాలనుకుంటున్న ఏపీ, తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఏపీ పర్యాటక అభివృద్ధి శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

మొదటి రూటులో..

బస్సు ఫిబ్రవరి 11న తిరుపతిలో ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతుంది. తిరుపతి- ఒంటిమిట్ట- కడపబైపాస్- ఓర్వకల్లు, కర్నూలు బైపాస్- హైదరాబాద్- జబల్‌పూర్- చిత్రకూటు-ప్రయాగరాజ్-కాశి-నాగపూర్-ధర్మపురిలలో యాత్రికులను దించుతారు. హైదరాబాద్ నుంచి బయలుదేరేవారు ఫిబ్రవరి 12న ఉదయం 5 గంటలకు బారామతి హోటల్ వద్ద బస్సు ఎక్కాలి. హైదరాబాద్ యాత్రికులకు ఫిబ్రవరి 17న మధ్యాహ్నంతో యాత్ర ముగుస్తుంది. కర్నూలు యాత్రికులకూ ఇదే రోజు సాయంత్రం 5 గంటలకు, కడప, తిరుపతివారికి 18వతేదీ మధ్యాహ్నానికి యాత్ర పూర్తవుతుంది. తిరుపతి, కడప నుంచి నుంచి బయలుదేరే పెద్దలు(ఒకరికి) రూ.22 వేలు, పిల్లలకు(ఒకరికి) రూ.19 వేలు, కర్నూలు, హైదరాబాద్ నుంచి బయలుదేరే పెద్దలకు రూ.20 వేలు, పిల్లకు రూ 17,200 చెల్లించాలి. వివరాలకు తిరుపతి 98480 07033, కడప 9010 318811, కర్నూలు 96401 77759, హైదరాబాద్ 77298 30011లో సంప్రదించాలి.

రెండో రూటులో..

బస్సు ఫిబ్రవరి 12వతేదీ ఉదయం 6 గంటలకు నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయం వద్ద బయలుదేరుతుంది. నెల్లూరు-విజయవాడ-రాజమహేంద్రవరం-అన్నవరం-విశాఖపట్నం-పూరి-కోణార్క్-భువనేశ్వర్-కటక్-చండీపూర్-గయ-బుద్ధగయ-కాశి-ప్రయాగ్‌రాజ్‌కు చేరుతుంది. యాత్ర ముగించుకుని తిరిగి శ్రీకూర్మం-అరసవల్లి-మీదుగా విశాఖపట్నం-విజయవాడకు చేరుకుంటుంది. నెల్లూరు యాత్రికులకు విజయవాడలో కనకదుర్గమ్మ దర్శనం చేయిస్తారు. తిరిగి నెల్లూరు చేరుస్తారు. విజయవాడలో బరంపార్కు వద్ద, రాజమండ్రి వాళ్లు మహాకాళేశ్వర ఆలయం వద్ద బస్సు ఎక్కాలి. 13న ఉదయం 5 గంటలకు విశాఖపట్నంలో బీచ్‌రోడ్డులోని హోటల్ రాగా వద్ద ఎక్కాలి. విశాఖపట్నం యాత్రికులకు 18న రాత్రి 10 గంటలకు యాత్ర ముగుస్తుంది. 19న ఉదయం 10 గంటలకు రాజమండ్రి వారికి, అదేరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు విజయవాడ వారికి, రాత్రి 8 గంటలకు నెల్లూరు వారికి పూర్తవుతుంది. నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి నుంచి వెళ్లే పెద్దలు(ఒకరికి) రూ.25,600, పిల్లలు(ఒకరికి) రూ.22,500, విశాఖపట్నంలో ఎక్కే పెద్దలు రూ.24,100, పిల్లలు రూ.21,200 చెల్లించాలి. దర్శనాలు, భోజనాలు, అల్పాహారం, బస ఖర్చులను యాత్రికులే భరించాలి. వివరాలకు నెల్లూరు 98480 07024, రాజమండ్రి 98486 29341, విజయవాడ 98480 07025 విశాఖపట్నం 98488 13584, 98480 07022లో సంప్రదించాలి. ఏపీటీడీసీ, టూరిజంఏపీ వెబ్‌సైట్లు లేదా అధీకృత ఏజెంట్ల ద్వారా సీట్లు రిజర్వ్ చేసుకోవచ్చు.

5న ప్రయాగ్‌రాజ్‌కు ఆర్టీసీ బస్సు

ఏపీఎస్ఆర్టీసీ ఈనెల 5వతేదీన ప్రయాగ్‌రాజ్‌కు ఒక బస్సును నడుపుతోంది. 95198 సర్వీసు నెంబరు, సూపర్ లగ్జరీ బస్సు 5వతేదీ ఉదయం 11 గంటలకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్సు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. హైదరాబాద్- నాగపూర్ మీదుగా కుంభమేళాకు చేరుకుని, అక్కడి నుంచి ఆయోధ్య, కాశీ చూసుకుని విజయవాడ చేరుకుంటుంది. టికెట్ చార్జీ ఒక్కొక్కరికి రూ.8000, విజయవాడ-వారణాశి వెబ్‌సైట్‌లో వివరాలు చూడవచ్చు, భోజనం, వసతి, అల్పాహారం వ్యయాలు భక్తులే భరించాలి.

వెయిట్ లిఫ్టర్ నీలరాజుకు అభినందన

లబ్బీపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో నిర్వహిస్తున్న 38వ జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ఏపీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రానికి పేరుతెస్తున్నారని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. వెయిట్‌లిఫ్టింగ్ 67 కేజీల విభాగంలో గుంటూరుకు చెందిన కె.నీలరాజు బంగారు పతకం సాధించడంతో అతనికి రవినాయుడు శుక్రవారం ఫోన్‌లో అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పరంగా తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు.

మచిలీపట్నం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.480

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథం నిర్మాణ పనులు ప్రారంభం



పూజ చేసి రథం పనులను ప్రారంభిస్తున్న ఈవో శ్రీరామవరప్రసాదరావు

మోపిదేవి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా జరిగే రథోత్సవానికి రథం నిర్మాణ పనులను ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఫిబ్రవరి 4వ తేదీన స్వామివారి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. రథం నిర్మాణ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.



కన్యక పరమేశ్వరి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



నాగాయలంకలో అమ్మవారికి పవిత్ర స్నానం చేయించి తీసుకువస్తున్న మహిళలు



చల్లపల్లిలో పల్లకీసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



పెడనలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

వాసవీమాతకు భక్తిశ్రద్ధలతో పూజలు

మచిలీపట్నం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణ చేశా రు. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. **పెడన :** కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాగితను ఘనంగా సత్కరించారు. మహిళలు లలితా పారాయణం చేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు తమ్మన సుబ్బారావు, మామిడి ప్రసాద్, కొల్లూరి రాధాకృష్ణగుప్తా, కోడూరి రమేష్, ఇమ్మడి నాగపోతరావు పాల్గొన్నారు. **నాగాయలంక :** వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం, వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో మహిళలు 102 బిందెలతో పవిత్ర కృష్ణా జలాలు తీసుకువచ్చి, ఆవుపాలు, తేనె, నెయ్యి వంటి సుగంధ ద్రవ్యాలతో అమ్మవారిని అభిషేకించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మిమండలి వెంకట్రామ్ - సాయి సుప్రియ దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నసంతర్పణ జరిగింది. చిట్టా సాంబశివరావు, చిట్టా శివ నాగేశ్వరరావు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, పొన్నూరు రవితేజ, చిట్టా శేఖర్, తాడికొండ సత్యనారాయణ, వంకాయల రాజేష్, తూనుగుంట్ల శేషు తదితరులు పర్యవేక్షించారు. **మోపిదేవి :** వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మోపిదేవిలోని రామకృష్ణా గ్రాండ్ మండపంలో ఆర్యవైశ్య జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు విస్సంశెట్టి మొగిలేశ్వర గుప్తా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విస్సంశెట్టి లోకేష్, విస్సంశెట్టి రాజా, గణపతి తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం చల్లపల్లిలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. కన్యకా పరమేశ్వరీ ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావు శ్రీఆర్యవైశ్యసంఘ భవనంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో కలశజ్యోతి ప్రదర్శన, యువజన సంఘం ఆధ్వర్యంలో పల్లకీసేవను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. సర్పంచ్ కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఆర్యవైశ్యసంఘ నేతలు జల్లూరి ప్రసాద్, కొల్లిపర సాంబశివరావు, తమ్మన సతీష్‌కుమార్, దింటకుర్తి జ్యోతి, ఉరిమి మణికాంత్, కొల్లిపర నళిని వరలక్ష్మి, చెన్నగిరి సుజాత, తమ్మన సాంబశివరావు, దేసు సుధాకర్, మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, వరదా రాజశేఖర్ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మామిళ్లపల్లి శివరామకృష్ణ, హేమంత్‌కుమార్ అమ్మవారికి గాజులతో విశేష అలంకరణ చేశారు. రంగు రంగుల ముగ్గుల తో అమ్మవారి చిత్రాన్ని రూపొందించి చుట్టూ అఖండజ్యోతులు వెలిగించారు. వాసవీ మహిళా మండలి సభ్యుల అమ్మవారికి పూజలు చేశారు.

రక్తదాన శిబిరం

మచిలీపట్నం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం బైపాస్‌రోడ్డులోని వాసవీ భవన్‌లో శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, బందరు మండల ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి వీరాంజనేయులు, జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్, అన్నం ఆనంద్, మామిడి దుష్యంత్‌కుమార్, శివప్రసాద్, పద్మనాభుని శేఖర్, నంబూరి చలపతిరావు, వేముల శ్రీనివాస్, పులవర్తి నటరాజశేఖర్, వెచ్చా మల్లిఖార్జున గుప్తా, హరిగోపాల్, కొల్లిపర బాలాజీ, యండవల్లి మోహనరావు, అద్దేపల్లి మనోహర్, ఊర సురేంద్ర, పేరూరి బాబూరావు, యెండూరి పూర్ణ, తాడికొండ వంశీ, రాంబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీ జయరామ అంకితభావం అభినందనీయం

పెడన రూరల్, జనవరి31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించి ఉన్నతాధికారులు, ప్రజల మన్ననలు పొందాలని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ మద్దాలి జయరామ పదవీ విరమణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. జయరామ అంకిత భావంతో సేవలందించారిన కొనియాడారు. జడ్పీటీసీ సభ్యుడు నగేష్, మండల టీడీపీ అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్, శీరం ప్రసాద్, సర్పంచులు, కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది జయరామను ఘనంగా సత్కరించారు.

నాగాయలంక మండల సమావేశం నేడు

నాగాయలంక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జె.వి.సీతారామ కుమార్ తెలిపారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ శాఖల పనితీరును సమీక్షిస్తారు. ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఐక్యకాపరుల 30వ వార్షికోత్సవం

చల్లపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల ఇమ్మానియేల్ ఐక్యకాపరుల సహవాసం 30వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అధ్యక్షుడు బిషప్ సుదర్శన్ మోజెస్, ఉపాధ్యక్షుడు సాల్మన్‌రాజు, కార్యదర్శి ఎం.మరియకుమార్, కోశాధికారి తాతా సత్యమూర్తి, జి.ఏసురాజు, పి.ఏసుదాస్, ఏసు ముత్యాలు, డేవిడ్, సంగీతరావు, స్వామిదాస్, ఆసుపత్రి సూపర్నెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తలశిల కృష్ణవేణమ్మకు ప్రముఖుల నివాళి

నాగాయలంక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మాజీ సర్పంచ్, దివంగత తలశిల వెంకటేశ్వర వరప్రసాద్ తల్లి తలశిల కృష్ణవేణమ్మ (97) స్వగృహంలో మృతి చెందారు. కృష్ణవేణమ్మ భర్త తలశిల కృష్ణమూర్తి కూడా నాగాయలంక సర్పంచ్‌గా పని చేశారు.

టీడీపీ నేత మెండు లక్ష్మణరావు, సర్పంచ్ కైతేపల్లి అంకాలు, ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు, ఉప్పల ప్రసాద్, తలశిల స్వర్ణలత, బం డ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, లకనం నాగాంజనేయులు, తలశిల శివరామకృష్ణ, తలశిల రామకృష్ణ చౌదరి, తలశిల సత్యనారాయణ, తలశిల నాగేశ్వరరావు, దారా రామకృష్ణ తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఉచిత పశువైద్యశిబిరం

పెడన రూరల్, జనవరి31 (ఆంధ్రజ్యోతి) : పశువుల ఆరోగ్యంపట్ల రైతులు శ్రద్ధ చూపాలని మండల పశువైద్యాధికారి యం.అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. కొంగంచర్ల, కుమ్మరిగుంట, గురివిందగుంట గ్రామాల్లో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు, సూరిబాబు, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



రాజుపేటలోని డంపింగ్‌యార్డును పరిశీలించి కమిషనర్‌కు సూచనలు చేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ డీకే బాలాజీ కమిషనర్‌కు ఆదేశించారు. రాజుపేట, నేషనల్ కాలేజీ నాగపోతురావు సెంటర్, డంపింగ్ యార్డు తదితర ప్రాంతాల్లో శుక్రవారం కలెక్టర్ విస్తృతం గా పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. సేకరించిన తడి చెత్తను, పొడి చెత్తను వేరువేరుగా వేయాలన్నారు. డ్రైనేజీల్లో మురుగు సరిగా పారేలా సిల్టు తీయించాలన్నారు. డంపింగ్ యార్డులోని చెత్తను ఎప్పటికప్పుడు గుంటూరు యూనిట్‌కు పంపాలని మునిసిపల్ కమిషనరుకు సూచించారు. గిరిజన సంక్షేమ శాఖాధికారి ధూర్జటి, మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

డివిజనల్ పీఆర్వో శ్రీనివాసరావుకు సత్కారం



సమాచార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన డివిజనల్ పీఆర్వో ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం పదవీ విరమణ చేశారు. జిల్లా కోర్టు సెంటర్‌లోని ఫంక్షన్ హాలులో కలెక్టర్ బాలాజీ, పలువురు అధికారులు, పాత్రికేయులు ఆయనను ఘనంగా సత్కరించారు.



విరాళాన్ని కమిటీ అందజేస్తున్న దాతలు

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.లక్ష విరాళం

కోడూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో పునర్నిర్మాణం చేపట్టిన శివరామకృష్ణ క్షేత్రానికి లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన సింహాద్రి మురళీధర్ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. అల్లుడు సిరిగుడి గంగాధర్ (యుఎస్‌ఏ) సౌ జన్యంతో విరాళాన్ని ఆలయ నిర్మాణానికి అందించినట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మురళీధర్ దంపతులను సత్కరించి అభినందనలు తెలిపారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బడే భావన్నారాయణ, సుభాష్‌చంద్రబోస్, బూరగడ్డ హరి పాల్గొన్నారు.



స్వామివారికి తమలపాకుల పూజ చేస్తున్న భక్తులు

ముగిసిన హనుమాన్ చాలీసా యజ్ఞం

అవనిగడ్డ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఆంజనేయస్వామికి లక్ష నాగవల్లి (తమలపాకులు) అర్చనతో లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఆవరణంలో 108 రోజులుగా నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా పారాయణ మహాయజం శుక్రవారం వైభవంగా ముగిసింది. ఆగమ పండితులు దీవి రఘు ఆధ్వర్యంలో అభిషేకాలు జరిపారు. శోభాయాత్ర నిర్వహించారు. న్యాయవాది సనకా రఘురామ ప్రసాద్, తుంగల సుధాకర్ బాబు, రెడ్రౌతు రామమోహనరావు, శ్రీహరిబాబు దంపతులు పాల్గొన్నారు. చిట్టా ప్రసాద్, హిమగిరి ప్రసాద్, తోట శ్యామ్ కిషోర్ నాయుడు పర్యవేక్షించారు.



రహదారి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ దాసరి విజయ్ కుమార్

నాణ్యతా ప్రమాణాలతో రహదారుల నిర్మాణం

అవనిగడ్డ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పాత కోట రహదారిని నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ పంచాయతీరాజ్ ఏఈ బ్రహ్మానందబాబుకు విజ్ఞప్తి చేశారు. రహదారి పనులను ఆయన పరిశీలించారు. పులిగడ్డకు ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు కాగా, రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ జాకబ్ ప్రసాద్

ఘనంగా జనవరి పండుగ

ఘంటసాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తెలుగురావుపాలెం ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జనవరి పండుగ ఘనంగా నిర్వహించారు. ఫాదర్ జాకబ్ ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు, దివ్య బలిపూజ జరిపారు. గ్రామస్థులు, ఆడపడుచులు రావటంతో పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, మండల టీడీపీ అధ్యక్షుడుతుమ్మల చౌదరిబాబు ప్రార్థనల్లో పాల్గొని గ్రామస్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆది ఆంధ్ర ఫీల్డ్ లేబర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), మాజీ సర్పంచ్ ఆరుబాక రవి, జనసేన నాయకులు సుగ్గన పవన్ కుమార్, కొండవీటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని జ్ఞానపూజకు నగదు అందజేస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

పాలిటెక్నిక్ విద్యార్థిని వైద్యానికి రూ.1,55,558 సాయం

పెడన, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన మఠంవీధికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థిని భట్ట జ్ఞానపూజ వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యం శుక్రవారం రూ1,55,558 అందించారు. రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, కోశాధికారి కొండపల్లి పరమేశ్వరరావు, పెడన మునిసిపల్ మాజీ చైర్మన్ బండారు ఆనందప్రసాద్, దేవాంగ సేవా సమితి ప్రతినిధి ఊటుకూరి సుధీర్ పాల్గొన్నారు.

తుమ్మలపాలెంలో రహదారికి శంకుస్థాపన



గూడూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తుమ్మలపాలెం గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం జడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు భూమిపూజ చేశారు. రూ. 7 లక్షల జిల్లా పరిషత్ నిధులతో రోడ్డు నిర్మించడం జరుగుతుందన్నారు. సర్పంచ్ కోడె రేణుకాదేవి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై చాణిక్య

క్రీడలతో ఎంతో మేలు

కోడూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం సాధ్యమవుతాయని ఎస్సై కె.చాణిక్య అన్నారు. లింగారెడ్డిపాలెం జడ్పీఉన్నత పాఠశాలలో కృష్ణాజిల్లా సెకండరీ స్కూల్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికల కబడ్డీ, షటిల్, ఖో-ఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఎస్సై చాణిక్య, అప్పికట్ల అప్పారావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. హెచ్‌ఎం కె.నాగరత్నకుమారి, ఎంఈవోలు టివి.ఎం.రామదాసు, శ్రీనివాసరావు, బొమ్మిడి శ్రీకాంత్, చిట్టిప్రోలు బ్రహ్మారావు, వ్యాయామ ఉపాధ్యాయులు, బిడిఆర్.ప్రసాద్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సమావేశం

గూడూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సమావేశం శుక్రవారం మల్లవోలు అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన త్రినాథ్ ఇంటి వద్ద జరిగింది. ఫిబ్రవరి 16న విజయవాడలో జరుగుతున్న నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం, దేవాంగులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలపడేందుకు చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊటుకూరు సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి శివశంకరయ్య, ఏ. రాజు, అరుణబాబు, బాపట్ల జిల్లా దేవాంగ సంఘం ప్రధాన కార్యదర్శి బండ్ల బాబు, బాపట్ల జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ బల్ల వెంకటేశ్వరరావు, బండారులంక దేవాంగ సంఘం అధ్యక్షుడు ఊటుకూరి సుధీర్ తదితర దేవాంగ ప్రముఖులు పాల్గొన్నారు.



ఎనిమిది సిమెంట్ బల్లల వితరణ

ఘంటసాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలకు చెందిన అయినపూడి వెంకట రామయ్య - విశాలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు, ఆదర్శ రైతు అయినపూడి విజయ్ కుమార్, కుటుంబసభ్యులు రూ.50 వేల విలువ కలిగిన ఎనిమిది సిమెంట్ బల్లలను అందజేశారు. ప్రజలకు, రైతులకు ఉపయోగపడే విధంగా ఘంటసాల పరిసర ప్రాంతాల్లో శుక్రవారం వీటిని ఏర్పాటు చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

రేషన్ సక్రమ రవాణాకు సహకరించాలి : ఆర్డీవో

పామర్రు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్‌ను సక్రమ రవాణాకు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జులు సహకరించాలని ఉయ్యూరు ఆర్డీవో బీఎస్‌హెచ్ షారోన్ అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులోని రేషన్ స్టాక్‌పాయింట్‌ను తహసీల్దార్ రవికాంత్‌తో కలసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు. ప్రతి నెలా నిర్ణీత గడువులోగా ఈ-పోస్ మిషన్ ద్వారా సరుకులు రేషన్ దుకాణాలకు, ఎండీయూలకు సరఫరా అయ్యే విధంగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. పీడీఎస్‌డీటీ రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో

కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మొవ్వలో బారులు తీరిన కొనుగోలుదారులు

కూచిపూడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : భూముల మార్కెట్ ధరలతోపాటు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనుండటంతో ముగింపు రోజైన శుక్రవారం మొవ్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనుగోలుదారులు, అమ్మకందారులతో కిక్కిరిసింది. పాత రేట్ల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయించుకుంటే లబ్ధి పొందవచ్చునని కొనుగోలుదారులు భావించటంతో చివరి రోజున రిజిస్ట్రేషన్లు అధిక సంఖ్యలో జరిగాయి. ఇదే అదనుగా భావించిన డాక్యుమెంట్ రైటర్లు తమ తెలివి తేటలు ప్రదర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. మొవ్వ - కోసూరు రోడ్డులోని రిజిస్ట్రార్ కార్యాలయం రహదారి ద్విచక్ర వాహనాలు, కార్లతో రద్దీగా మారింది. గత మూడు రోజుల నుంచి మొవ్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 140 వరకు రిజిస్ట్రేషన్లు అయినట్లు సమాచారం.

వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ 3న

పమిడిముక్కల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఐనంపూడిలో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈనెల 3న నూతన విగ్రహ, గోదాదేవి, గరుడ మూర్తుల నూతన విగ్రహ, నూతన జీవధ్వజదండ, ఆలయ శిఖర ప్రతిష్ఠాపనా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వంశపారంపర్య అర్చకులు, ఆలయ అభివృద్ధి సంఘం తెలిపింది.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించండి

అధికారులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశం

గుడివాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పంచవటి కాలనీలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సచివాలయ కార్యదర్శులు, ఆర్‌వోబీ ఇంజినీర్‌లను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించారు. శుక్రవారం ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు బంటుమిల్లి రోడ్డు, పాత బైపాస్ రోడ్డు, పంచవటి కాలనీ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల ద్విచక్రవాహనంపై పర్యటించారు. బంటుమిల్లి రోడ్డులోని చేపల మార్కెట్‌లో చేపల విక్రయించే మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, ఎల్లప్పుడు ప్రజావేదికలో అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

వాసవీమాతను దర్శించుకున్న వెనిగండ్ల

కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన శ్రీవాసవి అమ్మవారి 2642వ ఆత్మార్పణ దినోత్సవంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు యక్కలి మణిదీప్, వైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, సంఘ ప్రముఖులు తిరువీధి శ్రీరాములు, కొత్త మురళీ, తూంపూడి సాంబశివరావు, కూరాళ్ల శ్యాం, దోసపాటి హరిప్రసాద్, శ్రీకన్యకా పరమేశ్వరీ దేవస్థాన ఆధ్యాత్మిక కమిటీ, వాసవి క్లబ్ వనిత విదర్భపురి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష

గుడ్లవల్లేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ లోకరాజు సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు వివరించారు. జంగం మోహనరావు ,సూరపనేని పరంధామయ్య, రంగబాబు, అట్లూరి దిలీప్‌కుమార్, ఓరా పాపారావు, పిడుగు దేవసహాయం, కోటప్రోలు నాగు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: రాజకీయ నాయకులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాజకీయ నాయకుల విగ్రహా లకు ముసు గులు కప్పే విషయంలో ఏలాంటి అభ్యంత రాలు పెట్టవద్దన్నారు. నాయకులందరూ సహకరించాలని కోరారు. టీడీపీ, బీజేపీ, సీపీఎం, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

4లోగా జీతాలు, పీఎఫ్‌లను చెల్లించాలి

ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు గూడపాటి

గుడివాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శానిటేషన్ మహిళ పారిశుధ్య కాంట్రాక్టర్ గత రెండు నెలలుగా జీతాలు, పీఎఫ్‌లను ఫిబ్రవరి 4లోగా చెల్లించకుంటే నిరవధిక సమ్మె తప్పదని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు గూడపాటి ప్రకాష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రిలో పని చేసే మహిళ పారిశుధ్య కార్మికులకు జీతాలు, పీఎఫ్ చెల్లించడం లేదనే సమాచారం మేరకు జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ జయరాజు, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవిలతో ఏఐటీయూసీ, ఎస్‌జీవోస్ అసోసియేషన్ నాయకులతో చర్చలు జరిపారు. ఫిబ్రవరి 4లోగా కార్మికులకు జీతాలు చెల్లించాలని, పీఎఫ్ బకాయిలను చెల్లించాలని, లేనిపక్షంలో సమ్మె తప్పదని హెచ్చరించారు. 4 వరకు కార్మికులు విధులకు హాజరవుతారని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, ఎస్‌జీవోస్ తాలుకా యూనిట్ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, కార్మికులు వడ్డాది రమణమ్మ, కనుమూరి విజయలక్ష్మీ, వేల్పుల ధనలక్ష్మీ, మాతంగి మేరిమ్మ, దొండపాటి పద్మావతి, కోటేశ్వరమ్మ, తెరెజమ్మ, మణిమ్మ తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడుతున్న ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవి

నిమ్మకూరులో కోదండరామస్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ

పామర్రు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామస్థుల సహకారంతో పాటుగా టీటీడీ నిధులు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మితమైన శ్రీకోదండ రామస్వామి ఆలయలో విగ్రహ ప్రతిష్ఠా, శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నిమ్మకూరు శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు వైఎల్ఎన్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఉభయదాతలుగా గ్రామానికి చెందిన సూరపనేని చంద్రశేఖర్, లక్ష్మీరాజ్యం, నందమూరి శివరామకృష్ణ రాజ్యలక్ష్మీ, తుమ్మల నాగేశ్వరరావు రమణ కుమారి, నందమూరి జయకృష్ణప్రసాద్ స్వరా జ్యలక్ష్మీ, అరిగెల బాలుడు అంజనీతేజశ్రీ దంపతులు స్వామివార్లకు కలశారాధన, మహాపూర్ణాహుతి, శిఖర ప్రతిష్ఠలు, విశేష పూజాదికాలు, హోమాలు నిర్వహించారు. మహోత్సవంలో పామర్రు తహసీల్దార్ గూడపాటి రవికాంత్, యూనియన్ బ్యాంక్ మేనేజరు మనీష్, గ్రామసర్పంచ్ పడమటి దుర్గాశ్రీనివాస్‌లు పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర కుటుంబసభ్యుల సౌజన్యంతో విచ్చేసిన భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎల్ఎన్ ఆచార్యులు

కృష్ణాడెల్టా చైర్మన్, వైస్ చైర్మన్లకు జాయింట్ చెక్‌పవర్ ఉత్తర్వులు

పామర్రు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణాడెల్టా సాగునీటి ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎంపికైన దేవనబోయిన వేంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్‌గా ఎన్నికైన వల్లూరిపల్లి గణేష్‌లకు శుక్రవారం విజయవాడ ఇరిగేషన్ కార్యాలయంలో ఎస్ఈ ఆర్.మోహనరావు చేతుల మీదగా ఇరువురుకు జాయింట్ చెక్‌పవర్ కల్పిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉత్తర్వులం దజేశారు. ఈ సందర్భంగా వైస్‌చైర్మన్ గణేష్ విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సాగుకు రైతులకు సాగునీటి ఇబ్బందులేకుండా పంటకాల్వల మరమ్మతులకు అధిక ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి : ఎంపీడీవో

గుడ్లవల్లేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేదలకు కేటాయించి ఇచ్చిన స్థలాల్లో గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు గుడ్లవల్లేరు ఎంపీడీవో టి.విజయసారథి సూచించారు. శుక్రవారం కౌతవరంచేవెంద్ర రోడ్డులోని నూతన లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలను పంచాయతీ, హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రారంభించనివారు వెంటనే ప్రారంభించాలని, నిర్మాణంలో ఉన్నవారు పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఇన్‌చార్జి కార్యదర్శి నరసింహారావు, హౌసింగ్ ఏఈ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

పమిడిముక్కల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గోపువానిపాలెం రోడ్డువద్ద శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మచిలీపట్నంకు చెందిన నడకుదురు రామాంజనేయులు, హేమంత్ కలిసి మోటార్ సైకిల్‌పై విజయవాడ నుంచి వస్తూ గోపువానిపాలెం రోడ్డు వద్ద ముందు వెళుతున్న కారును ఢీకొన్నారు. ఈప్రమాదంలో రామాంజనేయులు తీవ్రంగా గాయపడగా ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రామాంజనేయులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

102 మందికి వైద్య పరీక్షలు

తోట్లవల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఆస్టర్ రమేష్ ఆస్పత్రి ఉయ్యూరు వాకర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరపల్లిలో భీమవరపు అంకమ్మగుడి వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. న్యూరాలజిస్టు డాక్టర్ ప్రశాంత్‌బాబు, గుండె వైద్య నిపుణులు డాక్టర్ బండారు అనూష, జనరల్ వైద్యుడు డాక్టర్ పి. చంద్రమోహన్ 102 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, భీమవరపు అంజిరెడ్డి పలువురు గ్రామప్రముఖులు పాల్గొని సహాయ సహకారాలు అందించారు.



విజేతలతో ప్రిన్సిపాల్, పీడీలు

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఐపీఎస్‌జీఎం 2024-25 స్పోర్ట్స్ మీట్‌లో గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు బాలికల స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌తో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవశం చేసుకున్నారని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ తెలిపారు. విశాఖపట్నం కంచరపాలెంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ వేదికగా నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు జయకేతనం ఎగురవేయడం అభినందనీయమని అన్నారు. ఈ మీట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు సౌత్ జోన్‌కు అర్హత సాధించారని అన్నారు. విజేతలను వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీనివాసరావు, సహ ఫిజికల్ డైరెక్టర్ ఎం. భవదీప్, మెకానికల్ బ్రాంచ్ జూనియర్ ఇన్‌స్ట్రక్టర్ కె.పిచ్చయ్యలను యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పద్మావతి సేవలు అభినందనీయం

తోట్లవల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వైద్యఆరోగ్య శాఖలో 37 సంవత్సరాలుగా కూనపరెడ్డి పద్మావతి అందించిన సేవలు అభినందనీయమని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ టి సాయిప్రసన్న అన్నారు. తోట్లవల్లూరు పీహెచ్‌సీలో పబ్లిక్ హెల్త్ నర్సు(పీహెచ్ఎన్)గా పనిచేస్తు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన పద్మావతి, భర్త వెంకటేశ్వరరావు దంపతులను డాక్టర్, సిబ్బంది ఘనంగా సత్కరించి ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, సీహెచ్‌వోలు ఎం రోహిణి, సీహెచ్ పద్మావతి, అనిల్, సిబ్బంది, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.






వాసవీమాతకు పట్టువస్త్రాలను తీసుకెళుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

వాసవీమాతకు పట్టువస్త్రాల సమర్పణ

పామర్రు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆకాంక్షించారు. పామర్రులో శుక్రవారం వాసవీమాత ఆలయంలో జరిగిన ఆత్మార్పణ దినోత్సవంలో ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే హాజరై నూతన పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం తరఫున పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దాలిపర్తిప్రసాద్, పరిశసుబ్రహ్మణ్యం, మంతెన రామాంజనేయులు, పానుగంటి సందీప్, బోగ్గవరపు జాలయ్య, వీరంకి వెంకటేశ్వరరావు, జల్లిగణేష్ తదిరులు పాల్గొన్నారు.



హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ ఉద్యోగులు, భక్తులు

విఘ్నేశ్వరస్వామికి రూ.4.17లక్షల ఆదాయం

గుడివాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మెయిన్‌రోడ్డులోని శ్రీవిఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం రూ.4,17,814 సమకూరినట్లు ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) తెలిపారు. దేవదాయశాఖ తనిఖీ అధికారి ఉయ్యూరు సుధాకర్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కింపు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్, ధర్మకర్తలు పంచుమర్తి శ్రీనివాసరావు, లోయ వాసు, వికృతి పోతురాజు, శలంకాయల లీలాకుమారి, వీరమాచనేని శైలజ, సేవాబృందం సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఏడు పూరిళ్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కూచిపూడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మొవ్వ మండలం కోసూరు గ్రామంలో గ్యాస్ సిలెండర్ లీకై జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడు పూరి గుడిసెలు అగ్నికి ఆహుతి కాగా, పది కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. మూడు లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. బాధిత కుటుంబాల వారు కట్టుబట్టలతో మిగిలారు. బోగెం ఏడుకొండలు, నల్లపోతు రాములమ్మ, బోగెం బాలకృష్ణ, బోగెం చింతయ్య, ఆవుల పెద్ద వెంకమ్మ, ఆవుల కోటేశ్వరరావు, ఆవుల వాసు గృహాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న మొవ్వ అగ్నిమాపక అధికారి కె.వెంకటేశ్వరరావు నేతృత్వంలోని సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. తహసీల్దార్ కె.మస్తాన్ బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు, రెండు గ్యాస్ సిలిండర్లు అందజేశారు. సర్పంచ్ పి.రమేష్, కార్యదర్శి ఎంఎస్ఎన్.మూర్తి, వీఆర్వో నవీన్ రెడ్డి, దేవినేని రమేష్, గోగినేని పెరుమాళ్లు తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

మెటల్ ఇండస్ట్రీలో చెలరేగిన మంటలు

గుడివాడ: అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానిక కుమ్మరి చెరువు వద్ద ఉన్న శ్రీహరి హరనాథ్ మెటల్ ఇండస్ట్రీస్‌లో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. ఇండస్ట్రీలో వాడే ఫర్నీచర్ ఆయిల్‌కు నిప్పు అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. సమాచారం తెలుసుకుని అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా ఇండస్ట్రీ చుట్టుపక్కల నివాస గృహాలుండటంతో వారు భయాందోళనలకు గురయ్యారు. మంటలను అదుపు చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది చూపిన చొరవను స్థానికులు ప్రశంసించారు.



మెటల్ ఇండస్ట్రీలో మంటలు

రోడ్డు భద్రతపై పోలీసుల బైక్ ర్యాలీ

పెదపారుపూడి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బైక్ ర్యాలీ ద్వారా హెల్మెట్ వినియోగంపై పోలీసులు అవగాహన కల్పించారు. శుక్రవారం వెంట్రప్రగడ గ్రామంలో హెల్మెట్‌ప్రాముఖ్యత, ట్రాఫిక్ చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించటానికి ఎస్సై ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది వాసవీక్లబ్ సహకారంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

వానపాములలో టీడీపీ సభ్యత్వ నమోదు

పెదపారుపూడి: టీడీపీ కార్యకర్తలకు సభ్యత్వంతోపాటు బీమా సౌకర్యం కల్పించి భరోసా నిస్తుందని నీటి సంఘం అధ్యక్షుడు కాగితం లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం వానపాములలో సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. వేములపల్లి నరసింహారావు, మెండెం దాసు, బాజీ, చల్ల రాజు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు నిత్యావసర వస్తువులు

గుడివాడ: మందపాడులోని నిరాశ్రయుల కేంద్రంలో శుక్రవారం బీజేపీ పట్టణ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కే) నిత్యావసరాలు, వృద్ధులకు అవసరమయ్యే వీల్ చైర్‌ను అందజేశారు. ఆదరణ సేవా ఫౌండేషన్ చైర్మన్ బోనం గోపిక, రీటా, హంసలేఖ పాల్గొన్నారు.